
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


3 తిరుపతి జిల్లా వార్తలు

బుధవారం 16 జూలై 2025

19న తిరుపతికి సీఎం చంద్రబాబు రాక



తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 19న తిరుపతికి విచ్చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులోభాగంగా సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటనకు విచ్చేస్తున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం పాల్గొనే వేదికను సిద్ధం చేయడానికి మంగళవారం మధ్యాహ్నం దామినేడు సమీపంలోని తూకివాకం వద్ద తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన ఎస్‌డబ్ల్యూపీసీకేంద్రాన్ని, నగరంలోని ఎస్వీయూ స్టేడియం, ఎస్వీజేఎస్‌ఎం పాఠశాల మైదానాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పాల్గొనే వేదికను బుధవారం ఖరారు కానున్నట్లు ఆయన 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



పాము పగబడుతుందా? మనిషి పగబడతాడా??

నిజమేమిటంటే పాముకు పగబట్టే శక్తి లేదు. మనిషికే ఆ శక్తి ఉంది. పగబట్టి మరీ పాములను చంపేస్తుంటారు.

అందుకే.. 'పాముకు తలలోనే విషం.. మనిషికి నిలువెల్లా విషమే!' అనే సామెత పుట్టింది.

ఇంతకీ పామువల్ల మనిషికి ప్రమాదమా? మనిషి వల్ల పాముకు నష్టమా??

మనిషి వల్ల పాముకే నష్టం పాపం!

కనిపిస్తే కొట్టి చంపేస్తారు. ఇది తప్పు.. పాము - పర్యావరణ సమతుల్యతలో చాలా ప్రాధాన్యంగలది అని చెప్పడానికే ఏటా జూన్ 16న వరల్డ్ స్నేక్ డే ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా శేషాచలంలో ఉండే పాములతో పాటూ, మన ప్రాంతంలో సంచరించే పాములూ వాటి లక్షణాల గురించి ప్రత్యేక కథనం..

- 6వ పేజీలో

ఎస్వీయూలో చిరుతల కలకలం

వెయ్యి కాదు 5 వేల మంది

తొలగించే దమ్ముందా?

- 6లో -

'ముక్కంటి' ఆలయ చైర్మన్ ఎవరు?

శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ ఎవరు? ఈ ప్రశ్నకు రెండు మూడు రోజుల్లో స్పష్టత రానున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై వారం రోజులుగా సాగుతున్న కసరత్తు తుది దశకు చేరుకుంది. అన్నీ సజావుగా సాగితే గురువారం చైర్మన్ పదవి ఎవరికి ఖరారైందన్న విషయాన్ని అధికారికంగా ప్రకటించనుంది అధిష్ఠానం. ఆశావహుల వడపోత, నేపథ్యాల పరిశీలన జరుగుతుండడంతో ఆశావహుల ప్రయత్నాలు జోరందుకున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మొదలైన కసరత్తు

రెండు మూడు రోజుల్లో ప్రకటన

అధినేత పరిశీలనలో పలువురి పేర్లు



కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచీ ఏడాది కాలంగా ముక్కంటి ఆలయ పాలకమండలి చైర్మన్ పదవి కోసం ఆశావహులు ఆత్రుతగా నిరీక్షిస్తున్నారు. రాష్ట్రంలోని 6-సి కేటగిరీ ఆలయాల్లో ఒకటైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి పౌరాణిక, చారిత్రక ప్రాధాన్యముంది. దానితో పాటే రోజువారీ భారీ సంఖ్యలో భక్తులు వచ్చే ఆలయం కావడం, రోజువారీ రూ.కోటికి పైగా ఆదాయం వున్న ఆలయం కావడంతో ప్రాముఖ్యం సంతరించుకుంది. అదే స్థాయిలో పాలకమండలి పదవికి తీవ్ర పోటీ కూడా వుంది. ఏడాదిగా ఆశావహులు ఎదురుచూపులు ఫలించే సమయం ఆసన్నం కావడంతో రకరకాల మార్గాల్లో తమ ప్రయత్నాలను ఉధృతం చేస్తున్నారు.

చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారి జాబితా పెద్దదే!

పాలకమండలి చైర్మన్ పదవిని ఆశించే వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్య నాయుడు ముందు వరుసలో వున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఆయన కుటుంబం పార్టీలో కొనసాగుతుండడంతో పాటు పార్టీకి, బొజ్జల కుటుంబానికి ఆయన నమ్మిన బంటుగా పేరుపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతల వేధింపులకు గురి కావడం, సుమారు ఎనిమిది కేసులను ఎదుర్కొన్నారు. వీటన్నింటికీ మించి స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సిఫారసు చేసిన ఏకైక పేరు ఈయనదే కావడం గమనార్హం. అలాగే మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తన వర్గం నుంచీ మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు ప్రవీణ్ పేరును అధిష్ఠానానికి ప్రతిపాదించారు. టీడీపీ నుంచీ సీనియర్ నేతలు రెడ్డివారి గురవారెడ్డి, దశరధాచారి కూడా పదవి ఆశిస్తున్నారు. వీరు నేరుగా అధిష్ఠానాన్నే నమ్ముకున్నారు. బీజేపీ ముఖ్యనేత కోలా ఆనంద్ తన కుటుంబసభ్యుల్లో ఒకరికి పదవి ఆశిస్తున్నట్టు సమాచారం. వీరు కాకుండా జనసేన నుంచీ మాజీ ఇన్‌ఛార్జి వినుత భర్త చంద్రబాబు పేరు కూడా అధిష్ఠానం పరిశీలనలో ఉండేది. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో జనసేన అధిష్ఠానం వారిని బహిష్కరించడం తెలిసిందే. తిరుపతికి చెందిన ఓ విద్యా సంస్థ అధినేత పేరు కూడా జనసేన తరపున బలంగా వినిపిస్తోంది. అయితే స్థానికేతరులు కావడంతో వెనుకబడినట్టు సమాచారం. చెంచయ్యనాయుడికి పదవి కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధిష్ఠానం వద్ద గట్టిగా పట్టుబట్టినట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో అస్తవ్యస్తంగా వున్న ముక్కంటి ఆలయ నిర్వహణను తాను ప్రక్షాళన చేసి చక్కదిద్దానని, ఇపుడు తాను సూచించిన వ్యక్తినే పాలక మండలి చైర్మన్‌గా నియమిస్తే ఆలయ నిర్వహణ సక్రమంగా ఉంటుందని చెబుతున్నట్టు సమాచారం.

ఐవీఆర్‌ఎస్ సర్వే చేపట్టిన అధిష్ఠానం

ముక్కంటి ఆలయ పాలకమండలి చైర్మన్ పదవి ఖరారు చేసే ప్రక్రియ తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఐవీఆర్‌ఎస్ సర్వే చేపట్టినట్టు సమాచారం. ఈ సర్వేలో ఆశావహుల పేర్లు ప్రస్తావించి పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తోందని తెలిసింది. నేతల సిఫారసుల సంగతి పక్కన పెడితే ఐవీఆర్‌ఎస్ సర్వేలో వచ్చే ఫలితాలను బట్టే చైర్మన్ పదవికి తగిన ఆశావహుని ఎంపిక చేసే పరిస్థితి వుందని తెలిసింది. మొత్తానికీ రెండు మూడు రోజుల్లో వెలువడనున్న పాలకమండలి చైర్మన్ ఎంపిక ప్రకటన కోసం ఆశావహులతో పాటు కూటమి పార్టీల శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు సైతం ఆత్రుతగా వేచి చూస్తున్నారు.

గుర్తింపులేని రాజకీయ పార్టీకి షోకాజ్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2019 నుంచి ఆరు ఏళ్లల్లో కనీసం ఒక ఎన్నికల్లో కూడా పోటీ చేయని గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు భారత ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా గూడూరు మిట్టపాళెంలోని తెలుగు బహుజన పార్టీకి షోకాజ్ నోటీసు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ లోపు ప్రధాన ఎన్నికల అధికారికి ఆ పార్టీ అధ్యక్షుడు కానీ, కార్యదర్శి కానీ అన్ని రకాలా ఆధారాలతో రాతపూర్వకంగా వివరణ లేఖ అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 21 లోపు వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం 5వ బ్లాక్ ప్రధాన ఎన్నికల అధికారి ముందు హాజరు కావాలని సూచించారు.

రూ.68 లక్షల నాన్ జ్యుడీషియల్ స్టాంపుల రాక

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నాన్ జ్యుడీషియల్ స్టాంపులు ఎట్టకేలకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరాయి. వీటిని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు తరలిస్తున్నారు. రూ.68లక్షల విలువైన (48వేల రూ.100 స్టాంపులు, 40వేల రూ.50 స్టాంపులు) అందాయి. మూడు నెలలుగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. ప్రజలు రిజిస్ట్రేషన్లు, ఒప్పందాలకు ఈ స్టాంపులే వినియోగిస్తుంటారు. ఈ కొరతను అవకాశంగా తీసుకుని స్టాంపు వెండర్లు అధిక ధరలకు అమ్మకాలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వానికి ఇండెంట్ పంపడంతో ఈ మేరకు స్టాంపులు వచ్చాయి.

డిప్లొమాలో లేటరల్ ఎంట్రీకి రేపటిలోగా దరఖాస్తు చేసుకోండి

- 19న ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), జూలై 15(ఆంధ్రజ్యోతి): బ్రిడ్జికోర్సు పూర్తిచేసిన ఐటీఐ విద్యార్థులు నేరుగా డిప్లొమా ఇంజినీరింగ్‌లో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకోసం ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి ఎస్వీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ వై.ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఏ కళాశాలలో సీటు కావాలనుకుంటారో ఆ కళాశాలలోనే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఆయా కళాశాలల్లో దరఖాస్తులు సమర్పించిన విద్యార్థులు 19వ తేదీ ఉదయం 10 గంటలకు తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, సీటు పొందినవారు అప్పటికప్పుడే రుసుముకింద సుమారు రూ. 6 వేలు చెల్లించాల్సి ఉంటుందని సూచించారు.

కడప జిల్లా సర్పంచి అరెస్టు

- చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన పర్యవసానం



తిరుపతి(నేరవిభాగం), జూలై 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో.. అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన కేసులో కడప జిల్లా ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచ్ షేక్ అష్రద్ అయూబ్‌బాషాను తిరుపతి సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చక్రాయపేట మండలం ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచి షేక్ అష్రద్ అయూబ్ బాషా వైసీపీకి విధేయుడు. 2024లో తన ఫేస్‌బుక్ ఖాతాలో చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టాడు. అప్పట్లో చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తిరుపతిలో ఉన్నట్లు సీఐడీ పోలీసులకు సమాచారం వచ్చింది. అతడి సెల్‌ఫోను నెంబరును ట్రాక్ చేసి అరెస్టు చేశారు. గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐడీ సీఐ రంగస్వామి చెప్పారు.

రేపు టెన్త్, ఇంటర్ మిగులు సీట్లకు కౌన్సెలింగ్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి గురువారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త టి పద్మజ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న విద్యార్థులు 17వ తేదీ ఉదయం 10గంటలకు చిత్తూరులోని ఎంప్లాయిమెంట్ కార్యాలయం కాంప్లెక్సులోని జిల్లా కో-ఆర్డినేటర్ ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

క్రీడా కిట్లు ఏమయ్యాయి?

- ఆడుదాం.. ఆంధ్ర
- విజేతల ఎంపికలో వైసీపీ మార్కు రాజకీయం
- వారం రోజుల్లో డీజీపీకి విజిలెన్స్ నివేదిక

'ఆడుదాం.. ఆంధ్రా'లో నిధుల దుర్వినియోగం జరిగిందా? క్రీడా కిట్ల నుంచి బహుమతుల ప్రదానం వరకు ఇష్టారాజ్యంగా వ్యవహరించారా? పాఠశాలలకు చేరాల్సిన కిట్లు ఏమయ్యాయి? వీటిపై విజిలెన్సు విచారణ కొలిక్కి వచ్చింది. వారం రోజుల్లో డీజీపీకి నివేదిక అందించనున్నట్లు తెలిసింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

'ఆడుదాం.. ఆంధ్ర' కార్యక్రమం 2023 డిసెంబరులో ప్రారంభమైంది. గ్రామ, వార్డు స్థాయిలో ఆటలు జరిగాయి. 2024 జనవరిలో మండలస్థాయిలో, జనవరి నెలాఖరులో మున్సిపాలిటీ.. ఫిబ్రవరి మొదటి వారంలో జిల్లా స్థాయిలో వివిధ రకాల ఆటలు ఆడించారు. దీనికోసం ప్రభుత్వం ప్రతి మండల, మున్సిపల్, నియోజకవర్గానికి సంబంధించి రూ.25,000 వంతున.. ప్రతి వార్డు, గ్రామ సచివాలయానికి రూ.10,000 చొప్పున మంజూరు చేసింది. ఇవన్నీ కలిపి చిత్తూరు జిల్లాకు రూ.81 లక్షలు, తిరుపతి జిల్లాకు రూ.83 లక్షలు వచ్చాయి. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి




వరకు క్రికెట్, వాలీబాల్, కబడీ, ఖోఖో, బ్యాడ్మింటన్ ఆటలు ఆడారు. ఒక్కో ఆటకు సంబంధించి దాదాపు 10 కిట్లు శాప్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి ఆయా జిల్లాలకు పంపిణీ చేశారు. ఇవి నాసిరకంగా ఉన్నాయన్న ఆరోపణలు వచ్చాయి. ఈ కార్యక్రమ నిర్వహణలో గోల్‌మాల్ జరిగి నిధులు దుర్వినియోగమైనట్లు విమర్శలు వచ్చాయి. దీంతో వీటిపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో జిల్లాలో విచారణ సాగింది. ఈ విచారణలో కిట్ల నాణ్యతకు సంబంధించి విస్తుపోయే అంశాలు వెలుగు చూసినట్లు తెలిసింది. రాష్ట్రస్థాయిలో కొని పంపిన బ్యాట్లు, బాల్స్, షటిల్ బ్యాట్‌లు, టీ షర్టులు, కార్కులు ఇతరత్రా వస్తువులు పూర్తిగా నాణ్యత లోపించినట్లు విచారణలో తెలిసిందని ఓ అధికారి చెప్పారు. ఒక ఆటలో వాడిన కిట్లు.. రెండో ఆటకు పనికి రాకుండా పోయాయని కొందరు ఆటగాళ్లు విజిలెన్సు అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. మరోవైపు.. ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా కిట్లను ఆడుదాం-ఆంధ్ర ఆటలు ముగిశాక సంబంధిత పాఠశాలలకు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ, అప్పట్లో ఆ కిట్లు పాఠశాలలకు చేరలేదని తెలిసింది. ఆ కిట్లు ఏమయ్యాయనే దిశగానూ విజిలెన్సు అధికారులు విచారించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విజేతల ఎంపికలోనూ వైసీపీ మార్కు రాజకీయం సాగినట్లు ఆరోపణలున్నాయి. తమకు కావాల్సిన కార్యకర్తలను విజేతలుగా ఎంపిక చేసినట్లు విమర్శలున్నాయి. కొన్నిచోట్ల విజేతల అకౌంట్లలో డబ్బులు జమ చేయనట్లు విచారణలో గుర్తించినట్లు సమాచారం. ఇలా.. అన్ని కోణాల్లోనూ విచారణ ముగించిన అధికారులు.. వారం రోజుల్లో డీజీపీకి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

ధరలున్నా.. తెగుళ్ల శాపం..!

- 'ఊజీ'తో టమోటాకు నల్లటి మచ్చలు

సోమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏడాది పొడవునా సాగు చేసే టమోటా రైతుల్లో ఆందోళన నెలకొంది. సీజన్‌తో సంబంధం లేకుండా రైతులు టమోటా సాగుపై మొగ్గు చూపుతున్నారు. సోమల మండలంలో విస్తారంగా టమోటా సాగు చేపట్టారు. గత సీజన్‌లో రికార్డుస్థాయిలో ధరలు పలికిన టమోటా సాగుపై మక్కువ పెంచుకున్న రైతన్నలు సోమల, నంజంపేట, కందూరు, నెల్లిమంద, నడింపల్లె, ఇరికిపెంట, అన్నెమ్మగారిపల్లె తదితర పంచాయతీల్లో సుమారు 3,600 ఎకరాల్లో గత డిసెంబరు నుంచి విడతల వారీగా సాగు చేపట్టారు. 15 కిలోల బాక్సు జూన్ నెల వరకు రూ.30 నుంచి రూ. 60 మాత్రమే పలికి రైతులు నష్టాలపాలయ్యారు. కొందరు రైతులు కోత కూలీలు, రవాణా ఖర్చులు కూడా రాక చేతి నుంచి చెల్లించారు. మరికొందరు తోటల్లోనే కాయలను పశువులకు



మేతగా వదిలేశారు. ఫిబ్రవరి, మార్చి వరకు నాట్లు వేసిన తోటల్లో దిగుబడులు వచ్చిన రైతులు ఎకరా సాగుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేసి నష్టపోయారు. ఏప్రిల్ నెలలో నాట్లు వేసిన తోటల్లో జూలై నెలలో దిగుబడులు వచ్చిన రైతులకు మాత్రమే 15 కిలోల బాక్సు రూ.100 నుంచి రూ.300 చేరుకోవడంతో పెట్టుబడులు మాత్రమే చేతికి అందాయి. ఈ సమయంలోనే వాతావరణం అనుకూలించక తోటల్లో పలు రకాల చీడపీడలు ఆశించడంతో వారంలో రెండు సార్లు మందులను పిచికారీ చేస్తూ వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. 100 బాక్సుల్లో 50 బాక్సులు ఊజీ ఈగల దాడులతో దెబ్బతిన్న కాయలు, నల్లమచ్చ కాయలు ఉండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఎండల తీవ్రతతో మొక్కలు ఎదుగుదల లేక పలు ఇబ్బందులు పడుతున్నారు. మూడు, నాలుగు సార్లు కోతలు కోస్తే దిగుబడులు తగ్గిపోతున్నాయి.ఈ పరిస్థితిలో నష్టాలే మిగులుతున్నాయని ఆందోళన



టమోటా తోటల్లో పండ్లపై నల్లని మచ్చలు

చెందుతున్నారు. టమోటాకు నల్లమచ్చలు, ఆకుముడత, తెల్లదోమ, పచ్చదోమలు వ్యాప్తి అధికంగా ఉండి మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోవడం, ధరలు ఉండి టమోటాలో నాణ్యత లేకపోవడంతో నష్టాలు చవిచూస్తున్నారు. టమోటా సాగుకు బిందుసేద్యం, కట్టెలు నాటడం, దారం వంటి ఖర్చులు పెరగడం, వాతావరణం అనుకూలించక వైరస్ ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టమోటా తోటల్లో ఊజీ ఈగలు బెడదతో కోతలు చేయకుండానే తోటల్లోనే పండ్లను వదిలేస్తున్నారు.ధరలు కొంత ఊరటగా ఉన్నా ఊజీ ఈగలు, నల్లమచ్చ తెగుళ్లతో నష్టపోతున్నారు.

రేపటి నుంచి పాలిసెట్ చివరిదశ కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్-2025 చివరి దశ కౌన్సెలింగ్ గురువారం నుంచి 20వ తేదీ వరకు ఉంటుందని జిల్లా కోఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించని విద్యార్థులు 17 నుంచి 19వ తేదీలోపు చెల్లించి కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చని సూచించారు. ఫీజు చెల్లించినవారు 18వ తేదీ నుంచి 20వ తేదీలోపు ఎంపికలు నమోదు చేసుకోవాలని సూచించారు.

డీఈఈ సెట్ అభ్యర్థులకు రేపటినుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వెదురుకుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డీఈఈ సెట్ 2025 పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 16వ తేదీ వరకు సీట్ల కేటాయింపునకు ఆన్‌లైన్ ద్వారా అవకాశం కల్పించినట్లు కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తర్వాత ఈ నెల 17 నుంచి 22వతేదీవరకు డైట్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఈనెల 25వ తేదీనుంచి తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

కబడ్డీ విజేత జట్టుకు అభినందన


ఫైనల్స్‌లో గెలిచిన తిరుపతి వెరిటాస్ సైనిక్ పాఠశాల జట్టు క్రీడాకారులు

రామచంద్రాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇటీవల జరిగిన కబడ్డీ పోటీల్లో తిరుపతి వెరిటాస్ సైనిక్ పాఠశాల విశేష ప్రతిభ కనబరిచింది. గద్వాలలోని ఎస్ఆర్ విద్యానికేతన్ వేదికగా ఈనెల 10 నుంచి 12 వరకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సీబీఎస్ఈ పాఠశాలల క్లస్టర్స్-7 బాలికల కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో అండర్ -17 విభాగంలో 32 జట్లు పాల్గొన్నాయి. తిరుపతి వెరిటాస్ సైనిక్ పాఠశాల, హైదరాబాద్ శాంతినికేతన్‌పాఠశాల జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. వెరిటాస్ విజేతగా నిలిచి బంగారు పతకం సాధించింది. సెప్టెంబరు 29 నుంచి హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందింది.. జట్టులోని క్రీడాకారులకు మంగళవారం పాఠశాల ఆవరణలో చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి, డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి, డీన్ సీజీ హెచ్‌ఖాన్, ప్రిన్సిపాల్ పీఆర్ఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ నాగార్జున అభినందించారు.

తలనీలాల సేకరణకు రేపు వేలం పాట

పాకాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీదేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామివారికి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలలో భక్తులు సమర్పించిన తలనీలాల సేకరణకు గురువారం బహిరంగవేలం నిర్వహించనున్నారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి తెలిపారు. ఇందులో పాల్గొనడానికి రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం పాట ముగిసిన వెంటనే మిగిలిన మొత్తం చెల్లించాలని తెలిపారు. ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఆగస్టు 13 నుంచి 17 వరకు జరుగుతాయన్నారు.

అభివృద్ధే టీడీపీకి శ్రీరామరక్ష : ఎమ్మెల్యే నాని


అభివృద్ధి గురించి మహిళకు వివరిస్తున్న నాని

ఎర్రావారిపాలెం, జూలై 15(ఆంధ్రజ్యోతి); అభివృద్ధే టీడీపీ పార్టీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే పులివర్తినాని అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా ఉస్తికాయల పెంటలో మంగళవారం ఆయన ఇంటింటికీ తిరిగారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన పనులను వివరించారు. ఎర్రావారిపాలెం-ఎల్లమంద రోడ్డును రూ.5కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో తల్లికి వందనం, మూడు సిలిండర్‌లు వంటిని ఇప్పటికే అమలు చేశామన్నారు. త్వరలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. అభివృద్ధి చేశామని ధైర్యంగా చెప్పగలుగుతున్నామన్నారు. నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు దేశిరెడ్డి రఘునాథ , మహేష్ నాయడు, నిరంజన్, చిన్నపరెడ్డి, వేణుగోపాల్, కొమ్మక లక్ష్మీదేవి, కేశవులు నాయుడు, దేశిరెడ్డి గోపి, దేవి తదితరలు పాల్గొన్నారు.

వేదాంతపురం టీడీపీ నూతన కార్యవర్గం


పరంధామయ్య-శ్యామ్‌బాబు

తిరుపతి రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం పంచాయతీ టీడీపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలుగా చెరుకుల పరంధామయ్య, తోట చిరంజీవి, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం. శ్యామ్‌బాబు, కోశాధికారిగా జయచంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శిలుగా రవిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సి. వెంకటేష్, కార్యదర్శులుగా రఘురామిరెడ్డి, పి. కుమారస్వామి, సాయికుమార్, తెలుగుయువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలుగా ఎం. నవీన్, శివప్రసాద్, తెలుగు మహిళ విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె. లక్ష్మీదేవి, కె. జ్యోతితో పాటు వివిధ విభాగాలకు కూడా నియమితులయ్యారు.

అవిలాల బీజేపీ కమిటీ ఎన్నిక


ఎన్నికైన మండల బీజేపీ కమిటీతో ముఖ్య నాయకులు

తిరుపతి రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): అవిలాల బీజేపీ కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి డాక్టర్ నరేష్, పార్టీ మహిళా నాయకురాలు గాలి పుష్పలత, సీనియర్ నాయకులు అవిలాల శ్రీధర్ నేతృత్వంలో ఎన్నిక సాగింది. మండల అధ్యక్షుడిగా దేవాంగుల ఈశ్వర్ ఎన్నికయ్యారు. ఆయన సమక్షంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా టి. మునిరాజ, జె. వరలక్ష్మి, ఎ. రగు, గౌతం, జి. గీత, ప్రధాన కార్యదర్శులుగా ఎం. రెడ్డిబాబు, సి. హరీశ్వర్, కార్యదర్శులుగా ఆర్. మురళీమోహన్, జె. శ్రీహరి, కె. జ్యోతి, వి. నాగేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా బి. నాగార్జున ఎన్నికయ్యారు.

బాలుర ఉన్నత పాఠశాల తనిఖీ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో కుమార్

చంద్రగిరి, జూలై 15(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నమోదు పెంచాలని, విద్యార్థుల ప్రగతి నివేదికలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పెంచాలని సూచించారు. ఎంఈవో లలిత కుమారి, హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పాండవ విద్యాభ్యాసం హరికథ

రామచంద్రాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భాగవతారిణి అనసూయ కౌరవ, పాండవ విద్యాభ్యాసాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలనడుమ చుట్టుగుంట నుంచి ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవమూర్తిని ఊరేగించారు.

టీడీపీ నేతకు శుభాకాంక్షలు


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు మోహన్‌రెడ్డి

చంద్రగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తొండవాడకు చెందిన టీడీపీ నాయకుడు పులికంటి మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తొండవాడ గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో మోహన్‌రెడ్డి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆయనకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగన్మోహన్‌నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉమాపతిరెడ్డి, బాలచంద్ర, గోపి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం


ఇంటింటా ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జులై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యమని మాజీ ఎంపీపీ బిందుమాధవి అన్నారు. మండలంలోని అనుపల్లిలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బిందుమాధవి మాట్లాడుతూ జగన్ పాలనలో విధ్వంసమైన రాష్ట్రాన్ని ఉన్నత స్థాయిలో నడిపేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఏడాదిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. విజయకుమార్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటేష్‌నాయుడు, మహేష్, దేవరాజులు, జవహర్ పాల్గొన్నారు.

బీజేపీ మండల నేతగా మునిరాజు


మునిరాజును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

చంద్రగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షుడిగా చంద్రగిరికి చెందిన కాకిమాను మునిరాజు ఎన్నికయ్యారు. మంగళవారం మండల ఇన్‌చార్జ్ టీడీ వరప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో మునిరాజును సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మునిగంగిరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, సునీల్‌కుమార్ యాదవ్, దొరస్వామి, రాణి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవానందమ నాయుడికి అభినందనలు


దేవానందంనాయుడిని సన్మానిస్తున్న నాయకులు

రామచంద్రాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ, టీడీపీ సీనియర్ నేత అబ్బూరు దేవానందమనాయుడు జన్మదిన వేడుకలు మంగళవారం పార్టీ శ్రేణులు నిర్వహించాయి. నగరి ఎమ్మెల్యే భాను ప్రకాష్, తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణలు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల నాయకులు అక్షయక్షేత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. జనార్ధనచౌదరి, తిరుమలరెడ్డి, నీలకంఠచౌదరి, వసంతనాయుడు, మునిరామిరెడ్డి, వేణునాథం, భాస్కర్‌నాయుడు, శేషాద్రి పాల్గొన్నారు.

గంగ కాలువలో వ్యక్తి మృతదేహం

సత్యవేడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తెలుగుగంగ కాలువలో మృతదేహాన్ని వెలికితీశారు.ఎస్ఐ రామ స్వామి తెలిపిన వివరాలు... మంగళవారం ఉదయం కొత్తమారి కుప్పం ఎస్టీ కాలనీ సమీపంలోని తెలుగుగంగ కాలువలో మృత దేహం తేలుతున్నట్టు స్థానికులు సమాచారం అందించారన్నారు. సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించా మ న్నారు. కాగా పో లీసుల విచారణలో మృత దేహం తొట్టంబేడు మండలం చిన్న సింగమాలకు చెందిన మునస్వామి (58)గా గుర్తించారు. ఈనెల 7న బహిర్భూమికి వెళ్లిన మునస్వామి కాళ్లుకడుక్కునేందుకు కాలు వలో దిగి నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. మృతుడి భార్య పాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

ఆటో బోల్తా: డ్రైవర్ మృతి

రేణిగుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన గాజులమండ్యం వంతెనపై మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలు... తిరుపతికి చెందిన ఆటో డ్రైవర్ సూరిముని మద్యం తాగి పుత్తూరుకు ఆటోలో వెళ్తుండగా గాజులమండ్యం వంతెనపై వేగాన్ని నియంత్రించలేక బోల్తా పడ్డాడు. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని రూయా ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

పద్మావతి హృదయాలయకు వైద్య పరికరాల కోసం ఈ-టెండర్

తిరుమల, జూలై15(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రికి 'హై ఫ్లో నాసల్ క్యానులా'-4 ఆన్ బై బ్యాక్ పాలసీ కింద సరఫరా చేసేందుకు అర్హులైన వారి నుంచి ఈ-టెండ్లను టీటీడీ ఆహ్వానించింది. ఈనెల 25 సాయంత్రం 4.30 గంటలకు టెక్నికల్ బిడ్ ఉంటుందని, వివరాలను టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని పేర్కొంది. అలాగే, చిత్తూరు జిల్లాలోని కలిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి 2025-26 సంవత్సరానికి గాను పూలు, పాలు, పెరుగు, అరటిపండ్లు, తమలపాకులు, టెంకాయలు తదితర పూజా సామాగ్రి సరఫరాకు కూడా టెండర్లు ఆహ్వానించింది.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

పాలసముద్రం, జూలై 15(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ రైతు దుర్మరణం చెందాడు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. పాలసముద్రం మండలంలోని నిశ్శంకాపురానికి చెందిన రాజశేఖర్(33) తన చెరకుతోటకు నీళ్లు పెట్టడానికి బోరుబావి వద్దకు మంగళవారం వెళ్లాడు. మోటర్ ఆన్‌కాక పోవడంతో స్టార్టర్‌ను మరమ్మతులు చేయడానికి ప్రయత్నించగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డుకు అంచులో చేతికందేలా ట్రాన్స్‌ఫార్మర్

తిరుపతి అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని శేషాచలనగర్‌కు వెళ్లే మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ప్రమాదం పొంచివుంది. రేణిగుంట మండలం వెంకటాపురం విద్యుత్ సెక్షన్ పరిధిలో దాదాపు రెండు దశాబ్దాల క్రితం శేషాచలనగర్‌లో అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. కాలక్రమంలో రోడ్డు మరమ్మతులతో ఎత్తు లేచిన కారణంగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన అనుసంధాన విద్యుత్ తీగలు చేతికందుతున్నాయి. అంతే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఒక పక్కకు తిరిగిపోయుంది. చుట్టూ కంపచెట్లు పెరిగిపోయాయి. దారికి సమీపంలోనే ఉండడంతో రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆలయ నిర్వహణపై సమసిపోని వివాదం

● తాజాగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం


ఆలయం ఎదుట మహిళల నిరసన

చంద్రగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ఆలయ నిర్వహణపె కొన్నేళ్లుగా ఇరువర్గాల మధ్య వివాదముంది. ఈనెల 18న వారికోత్సవాలు నిర్వహించనున్నందున గ్రామస్తులు ఆలయానికి సున్నం పనులు చేపట్టారు. సమాచారం అందుకున్న 50 మంది మహిళలు(సింగులు) చేరుకుని సున్నం పనులపై అభ్యంతరం తెలిపారు. ఆలయం తమ గ్రామస్తులదని బదులివ్వడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం పెరిగింది. పోలీసులు వచ్చి తాత్కాలికంగా ఆలయాన్ని మూసివేయించురు. సింగు మహిళలు మధ్యాహ్నం వరకు అక్కడే కూర్చొని. ఆలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులను కూడా ఆలయం వద్దకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. డీఎస్పీ ప్రసాద్ ఆలయాన్ని సందర్శించారు. ఆయన సూచన మేరకు ఇరువర్గాల్లో ఐదుగురు వంతున వెళ్లి వాదనలు వినిపించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఇరువర్గాలకూ పంచాయతి నిర్వహిస్తామని డీఎస్పీ చెప్పడంతో మహిళలు అక్కడ నుంచి వెళ్ళి పోయారు. ఆలయం వద్ద పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం అలిపిరి పాదాల మండపంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాదాల మండపం, ఆండాల్, పెరియాళ్వార్, లక్ష్మీనారాయణస్వామి సన్నిధిలలో మూలవిరాట్టులను వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచారు. గర్భాలయం, ఉప ఆలయాలు, ప్రాంగణాలు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను జలంతో శుభ్రం చేశారు. అనంతరం నామంకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, గంధంపొడి, కుంకుమ, పచ్చకర్పూరం తదితర సుగంధద్రవ్యాలతో కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. తరువాత స్వామి, అమ్మవార్లను కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం ఇత్యాదికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.

సౌత్ కొరియాలో ఉన్నత ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న ఫిజిక్స్ హెడ్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): సౌత్ కొరియాలో ఫిజిక్స్ విద్యార్థులకు ఉన్నత ఉపాధి అవకాశాలు ఉన్నాయని సౌత్ కొరియాలోని యాగ్నుం యూనివర్సిటీ ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో పీజీ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న సిలబస్ వల్ల అన్ని అంశాల్లో అవగాహన ఏర్పడు తుందన్నారు. ఈ తరహా అవగాహన ఉన్న వారికి విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలకు ఎలాంటి కొరత లేదన్నారు. ఆసక్తిని బట్టి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాదరాజు మాట్లాడుతూ ఫిజిక్స్‌లో పీజీ, పీహెచ్‌డీ చేసిన యూనివర్సిటీ విద్యార్థులు ఇప్పటికే దేశ, విదేశాల్లో మంచి స్థానాల్లో ఉన్నారని తెలిపారు. వీరి మార్గంలో మరింత మంది ఉన్నత అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. ఫిజిక్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి కేసులో లొంగిపోయిన నిందితుడు

చిత్తూరు లీగల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి కేసులో నిందితుడుగా ఉన్న శంకర ఆచారి మంగళవారం చిత్తూరు కోర్టులో లొంగిపోయాడు. ఈనెల 9వ తేదిన బంగారుపాళ్యం మార్కెట్‌యార్డులో శివకుమార్ ఫొటోలు తీస్తుండగా కొంతమంది వైసీపీ మూకలు అతనిపై దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో రెండవ ముద్దాయిగా వున్న ఏపీ శంకర ఆచారి పరారీలో ఉంటూ మంగళవారం సాయంత్రం చిత్తూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న పీడీఎం కోర్టులో లొంగిపోయాడు.న్యాయమూర్తి ఉమాదేవి అతనికి ఈనెల 24 వరకు రిమాండ్ విధిస్తూ పోలీసులకు అప్పగించారు.

భక్తుల సదుపాయాలపై టీటీడీ చైర్మన్ ఆరా


టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి క్యూలైన్‌లో నడవలేనని చెబుతున్న వృద్ధురాలు

తిరుమల, జూలై15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులకు అందుతున్న సేవలు, సదుపాయాల నిర్వహణపై మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శ్రీవారి ఆలయం వద్ద తాగునీరు, అన్నదానం, క్యూలైన్ల నిర్వహణ, పారిశుధ్యంపై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో చెన్నైకు చెందిన ప్రేమలత అనే వృద్ధురాలు చైర్మన్ వద్దకు వెళ్లి తాను క్యూలైన్‌లో నిలబడలేనని ప్రత్యేక దర్శనం కల్పించాలని కోరడంతో, ఆమెకు రూ.300 ప్రత్యేక దర్శనం కల్పించాలని అధికారులను చైర్మన్ ఆదేశించారు. బోర్డు సభ్యులు పనబాకలక్ష్మీ, జంగా కృష్ణమూర్తి, శాంతారామ్, నరేష్, జానకీదేవి కూడా చైర్మన్ వెంట ఉన్నారు. రాత్రి వెంగమాంబ అన్నప్రసాద కేంద్రానికి వెళ్లారు. సామాన్య భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు.

మధురానగర్‌లో తాగునీటి వెతలు

తిరుపతి(మధురానగర్), జూలై 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి నడి బొడ్డున ఉన్న మధురానగర్‌లో జనం దాహంతో అల్లాడిపోతున్నారు. మధురానగర్, రైల్వే కాలనీ, ఆశోక్‌నగర్, శివజ్యోతినగర్, సత్య నారాయణపురం ప్రాంతాలకు రెండు రోజుల కోసారి గంగ నీరు సరఫరా చేసేవారు. ఐదు రోజులుగా రామాపురం వద్ద రెండు మోటార్లు చెడిపోవడంతో తెలుగుగంగ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు కొందరు ట్యాంకర్ నీటిని రూ.500 వెచ్చించి కొనుగోలు చేసుకుంటున్నారు. తెలుగు గంగ నీరు రాని విషయం తెలుసుకున్న కమిషనర్ సోమవారం మధురానగర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తాజాగా మంగళవారం ఉదయం నీటి సరఫరా చేసినా అవి ఏమాత్రం చాలలేదని మహిళలు వాపోయారు. అధికారులు స్పందించి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన


మాట్లాడుతున్న వైద్యులు

చంద్రగిరి, జూలై 15(ఆంధ్రజ్యోతి): బీ.కొంగరవారిపల్లెలో మంగళవారం టీబీ వ్యాధిపై వైద్యులు అవగాహన కల్పించారు. ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా కోటాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజకుమార్ ఆధ్వర్యంలో కందులవారిపల్లి సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ .రాజకుమార్ టీబీ లక్షణాలు గురించి వివరించారు. కార్యక్రమంలో టీబీ సూపర్ వైజర్ రమణ ఎంపీహెచ్‌వో ఈశ్వరయ్య, వైద్య సిబ్బంది .వెంకటమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయానికి రూ.81.25 లక్షల ఆదాయం

ఐరాల(కాణిపాకం), జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి మంగళవారం నిర్వహించిన పలు సీల్డ్, ఆన్‌లైన్ టెండర్లు, బహిరంగ వేలంతో రూ.81,25,200 ఆదాయం లభించినట్లు ఈవో కిషోర్ తెలిపారు. తలనీలాల సేకరణ హక్కును పాటదారుడు రూ.71,00,000కు దక్కించుకున్నారు. కల్యాణ కట్ట ఎదురుగా బంకు నిర్వహణ హక్కును మరొకరు రూ.5,00,200కు దక్కించుకున్నారు. శివాలయం ఎదుట పార్కు, ఆలయ పరిసరాల్లో ఫొటోలు తీసే హక్కును ఇంకొకరు 5,25,000 కైవసం చేసుకున్నారు. వీరంతా ఏడాదిపాటు ఈ పనులు చేసుకోవచ్చని ఈవో తెలిపారు.

అడవి పందుల దాడిలో యువతికి గాయాలు

కుప్పం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం వి.మిట్టపల్లెలో మంగళవారం అడవి పందుల దాడిలో మీనాక్షి అనే యువతికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. మీనాక్షి తన సోదరితో కలిసి పొలానికి గడ్డి కోయడానికి వెళ్లింది. ఈసమయంలో అడవి పంది కుక్కను తరుముకుంటూ వీరివైపు వచ్చింది. మీనాక్షిపై దాడి చేసింది. ఆమె కుడికాలికి గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను కుప్పం ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

చెంగల్వరాయుడి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ




అంకురార్పణ పూజలు - పుట్టమట్టి

శ్రీకాళహస్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి సన్నిధి వద్ద మంగళవారం ఆడికృత్తిక ఉత్సవాలకు అంకురార్పణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముక్కంటి లయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై కొలువై ఉన్న వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని వేదమంత్రోచ్చరణల నడుమ పూజలు నిర్వహించారు. ఇక బుధవారం ధ్వజారోహణం జరగనుంది. ఈవో బాపిరెడ్డి, వేదపండితులు, ఆలయఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఏర్పాట్లు

కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఏర్పాట్లను మంగళవారం ఈవో బాపిరెడ్డి పరిశీలించారు. ఈనెల 19న భరణి, 20న ఆడికృత్తిక సందర్భంగా స్వామివారిని సుమారు 50వేలమంది భక్తులు దర్శించుకోనున్న నేపథ్యంలో విజ్ఞానగిరిపై అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యం, వీఐపీలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. నారదపుష్కరణిలో తలనీలాలు సమర్పించే భక్తులు స్నానాలు చేయడానికి స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో, 1వ పట్టణ సీఐ గోపి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాను
రైతులు సద్వినియోగం చేసుకోవాలి: జేసీ



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): పంటల బీమా పథకాన్ని రైతులు సద్వి నియోగం చేసుకోవాలని జేసీ శుభం బన్సల్ అన్నారు. సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం పంటల బీమా పథకం వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఖరీఫ్ సీజన్ 2025కు సంబంధించి రెండు పంటల బీమా పథకాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. రైతులు బీమా కోసం కామన్ సర్వీస్ సెంటర్‌లో కానీ లేదా స్వయంగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజరు రవికుమార్, ఇన్సూరెన్సు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేకేసీ విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయండి

- ఏపీ స్టూడెంట్ జేఏసీ



వీసీ, రిజిస్ట్రార్లకు విన్నవిస్తున్న నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేకేసీ విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ కోరింది. ఈ మేరకు ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు ఏపీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రియాదవ్ వినతిపత్రం అందజేశారు. ఒకే కాలేజీలో ఎంబీఏ, ఎంసీఏ, లా, హెల్త్ కోర్సులను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని తెలి పారు. సరైన సదుపాయాలు కల్పించకుండానే విద్యార్థుల నుంచీ పెద్దమొత్తంలో ఫీజులు దండు కుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, ఉపేంద్ర, పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడిని ఖండిస్తున్నాం

మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో వైసీపీ నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మేయర్ డాక్టర్ శిరీష, వైసీపీ నేతలు

తిరుపతి(జీవకోన), జూలై 15(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ హారికపై కొంతమంది దుండగులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. మంగళవారం నగర పరిధిలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వైసీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, నగర మహిళాధ్యక్షురాలు కోటేశ్వరమ్మ, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా : అభినయ్

తిరుపతి(జీవకోన), జూలై 15(ఆంధ్రజ్యోతి): ఈ ప్రభుత్వం వచ్చాక అన్ని పథకాలు అందుతున్నాయా అని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం జీవకోన పరిధిలోని 48వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేస్తూ ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, వాసుదేవయాదవ్, తలారి రాజేంద్ర పాల్గొన్నారు. ● అదేవిధంగా 35వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక నాయకులు దినేష్‌రాయల్, మద్దాలి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఎర్రజెండా ఉంటుంది

- రామానాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

తిరుపతి(ఆటోనగర్), జూలై15(ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు వెల్లడించారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక లీలామహల్ కూడలి వద్ద తిరుపతి హమాలీ వర్కర్స్ తిరుపతి శాఖ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబరు 26వ తేది భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రజల మధ్యలో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా వాడవాడలా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్‌డి రవి, విశ్వనాథ్, రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, చంద్ర, బాబు, ఈశ్వరయ్య, చిన్నబ్బ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ కనీసం ఓ మొక్క నాటాలి



నారాయణ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సుగుణమ్మ, ఏజీఎం శ్రీనివాసులు తదితరులు

తిరుపతి(విద్య), జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ వారివారి పుట్టినరోజున కనీసం ఒక్క మొక్క నాటి సంరక్షించాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ పిలుపునిచ్చారు. స్థానిక న్యూ ఇందిరానగర్ నారాయణ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సుగుణమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మొక్కలు విరివిగా పెంచడంవల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రకృతి రమణీయతను కాపాడే బాధ్యత భావిభారత పౌరులైన విద్యార్థుల చేతిలోనే ఉందన్నారు. అనంతరం విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఏజీఎం శ్రీనివాసులు, ఆర్ఐ వసంత్, ప్రిన్సిపాల్ హిమజ, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ హర్షవర్థిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి హరీష్ కుమార్‌కు పరామర్శ

తిరుపతి(సెంట్రల్), జూలై15: తిరుపతి రైల్వే స్టేషన్ యార్డ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన పాయింట్స్ మెన్ హరీష్ కుమార్‌ను మంగళవారం సీఆర్ఎస్ ఆస్పత్రిలో తిరుపతి శాఖ మజ్దూర్ యూనియన్ నాయకులు పరామర్శించారు. సోమవారం హిస్సార్ ఎక్స్‌ప్రెస్‌ను పార్కింగ్ చేసే సమయంలో మంటలు చెలరేగిన సంఘటనను చూసి రైలు పెట్టెలను వేరు చేసే సమయంలో హరీష్ గాయపడ్డాడు. అతడిని పరామర్శించిన వారిలో రవీంద్ర నాయక్, ఎండి, గౌస్, వెంకటేసులు ఉన్నారు.

వేడుకగా అమ్మవారికి ఉయ్యాల సేవ



తిరుచానూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సహస్ర దీపాల వెలుగులో పద్మావతి దేవికి అత్యంత వేడుకగా ఊంజల్ సేవ మంగళవారం నిర్వహించారు. అర్చకులు సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని మండపానికి వేంచేపు చేసి ఊంజల్‌పై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ సహస్ర దీపాలంకరణ వెలుగులో పద్మావతి అమ్మవారికి నేత్రపర్వంగా ఊంజల్ సేవ జరిగింది. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, సుభాస్కర్‌నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ఉదయభాస్కర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సోషియాలజీ పరిశోధకులు వి. ఉదయ భాస్కర్ డాక్టరేట్ పొందారు. 'సోషియల్ యాస్పెక్ట్స్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ - ఎ స్టడీ ఇన్ సెకెండరీ స్కూల్స్ ఆఫ్ నెల్లూరు డిస్ట్రిక్ట్' అనే అంశంపై ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు.

పుట్టుకతో వచ్చే కొన్ని లోపాలను
ప్లాస్టిక్ సర్జరీతో సరి చేయవచ్చు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్లు

తిరుపతి(వైద్యం), జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ సర్జరీ అనేది కేవలం అందాన్ని మెరుగుపరచడమే కాకుండా ప్రమాదాలు, గాయాలు లేదా పుట్టుకతో వచ్చే కొన్ని లోపాలను సరిచేయడంలో దోహదప డుతుందని రుయా ప్రొఫెసర్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రరెడ్డి అన్నారు. ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్లతోపాటు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్లాస్టిక్ సర్జరీలో అధునాతన పద్ధతులు వాటి ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం ప్లాస్టిక్ సర్జన్స్‌ను స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్లు ప్రవీణ్, ఝాన్సీ, విజయ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నగర మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

తిరుపతి(ఆటోనగర్), జూలై15(ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా నగరంలోని డివిజన్ల పరిధిలో తమ పార్టీ నిర్వహిస్తున్న నగర మహాసభలను విజయవంతం చెయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. తిరుపతి బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాల యంలో మంగళవారం పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పార్టీ మహాసభలు నిర్వహిస్తుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాను ప్రజలకు వివరిస్తూ చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వంద మొక్కలు, వంద జెండాలు నాటే కార్యక్రమానికి పార్టీ శ్రీకారం చుట్టిందన్నారు.

ఈ బాసు.. భలే స్మార్ట్!





నగరంలో చెత్త ఏరుకుని అమ్ముకుని బతికే వాళ్లను చూస్తుంటాం కానీ ఇతను మాత్రం మరీ స్మార్ట్. గరుడవారధి కింద స్తంభాల మధ్యన మొక్కలకు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప కంచెలనే ఏకంగా పెకలించేస్తున్నాడు. ఇదంతా చీకటి పడ్డాక చేసే పనికాదు. పగలే.. జనం తిరుగుతుండగానే, వాహనాలు దూసుకుపోతుండగానే, ట్రాఫిక్ పోలీసులు ఉండగానే.. ఇలా కంచెను బలంగా ముందుకీ వెనక్కీ వంచి ఇంచేస్తాడు. ఆ తర్వాత భుజానికి ఎత్తుకుని దర్జాగా నడచిపోతుంటాడు. ఈ పనిని ఎంత దీక్షగా చేస్తుంటాడంటే.. చుట్టూ తనను ఎవరైనా గమనిస్తున్నారా అని కూడా చూడడు. జనం కూడా.. ఏ గంజాయి బ్యాచ్ వాడో అయ్యుంటాడు.. మనకెందుకులే అని చూసీ చూడనట్టు వెళ్లిపోతుంటారు. ఇలా లక్షలు ఖర్చు పెట్టి వేసిన ఇనుప గ్రిల్స్ అన్నీ ఇప్పటికే దాదాపుగా మాయమైపోయాయి.

వినాయకసాగర్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం

- స్విమ్మింగ్ పూల్ ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్



స్విమ్మిగ్‌పూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, మౌర్య

తిరుపతి(జీవకోన), జూలై 15(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని వినాయకసాగర్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం వినాయకసాగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్విమ్మింగ్‌పూల్‌ను, ఆర్వో ప్లాంట్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్‌కు వాకింగ్‌కు వచ్చేవారికి మౌలిక సదుపయాలను కల్పిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి కార్పొరేషన్‌ను అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ అధునాతనంగా స్విమ్మింగ్‌పూల్ నిర్మించామన్నారు. పూల్ నిర్వహణ కోసం టెండర్ పిలవడంతో పాటు ప్రొఫెషనల్ కోచ్‌ల ఎంపిక ప్రక్రియను త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ సాగర్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి, ఆదం సుధాకర్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు కామరాజనాడార్

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



కామరాజ నాడార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

తిరుపతి(జీవకోన), జూలై 15(ఆంధ్రజ్యోతి): కామరాజ నాడార్ 123వ జయంతి వేడుకలను స్థానిక లీలామహల్ సర్కిల్ సమీపంలో ఏపీ హిందూ నాడార్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్ర తమిళనాడు సంఘం సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బీజేపీ నేత నవీన్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామరాజ నాడారు సామాజిక న్యాయం కోసం పాటుపడిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. అర్హులైన వారందరికీ రిజర్వేషన్లు అమలు చేసిన ముఖ్యమంత్రిగా ఆయన నిలిచారని తెలిపారు. గత ఎన్నికల్లో నాడార్ల సామాజిక వర్గం ఎన్డీయే కూటమికి అండగా నిలిచిందని నవీన్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. నాడార్ల సమస్యలను ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎప్పటికపుడు పరిష్కరిస్తోందన్నారు. నాడార్లను ఏపీలో బీసీలో చేర్చాలని నాడార్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజకుమార్‌నాడార్ కోరారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ హిందూ నాడార్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్ర తమిళనాడు సంఘం నాయకులు రామ్‌కుమార్, వీరకిరణ్, ఆనంద్, అరుణ్‌కుమార్, కార్పొరేటర్ దూది కుమారి, ఎన్డీయే కూటమి నాయకులు రాజారెడ్డి, వరప్రసాద్, గుండాల గోపీనాథ్‌రెడ్డి, తిరుత్తణి వేణుగోపాల్, మధుబాబు, అల్వార్ మురళి, ఆముదాల వెంకటేష్, రాజేష్ ఆచారి, పగడాల మురళి, మధులత, శిరీష పాల్గొన్నారు.

ముగిసిన వారం రోజుల బ్రిడ్జ్ కోర్సు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలో వారం రోజుల పాటు చేపట్టిన పీజీ బ్రిడ్జ్ కోర్సు మంగళవారం ముగిసింది. కొత్తగా పీజీలో చేరిన విద్యార్థులకు సంస్కృత భాషా, సాహిత్య అంశాలపై వారం రోజులుగా నిపుణుల చేత అవగాహన కల్పించారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, వ్యాకరణ విభాగాధిపతి పంకజ్ కుమార్ వ్యాస్, అధ్యాపకులు యశస్వి పాల్గొన్నారు.

కరెంటు కాటేస్తే..దిక్కెవరు..?

నివాసాలను తాకుతున్న విద్యుత్ తీగలు ● ఆందోళనలో హరితకాలనీ జనం ● పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు






ఇంటిగోడలో కలిసిపోయిన స్తంభం, ఇంటి ముందుభాగాన్ని తాకుతున్న స్తంభం, కాలువ మధ్యలో ఉన్న స్తంభం, ఇటీవల ఏర్పాటుచేసిన స్తంభం

తిరుపతి అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): తిరుమలనగర్ పంచాయతీలోని హరితకాలనీలో విద్యుత్ తీగలు నివాసాలను తాకుతున్నాయి. అయినా సంబంధిత విభాగం కనీసం పట్టించుకోవడం లేదు. దాదాపు రెండు దశాబ్దాలక్రితం హరితకాలనీ ఏర్పడింది. ఆ సమయంలోనే విద్యుత్ సదుపాయం కల్పించారు. అప్పుడు చిన్న చిన్న గుడిసెలు ఉండగా విద్యుత్ తీగలతో సమస్య రాలేదు. కాలక్రమేణా గుడిసెల స్థానంలో మిద్దెలు నిర్మించుకున్నారు. వారికి కేటాయించిన స్థలంలో పూర్తిగా ఇళ్లను ఏర్పాటు చేసుకున్నారు. అయితే వారికి ఉన్నదే కాస్త స్థలం కావడంతో ఆ కాలనీలోని మూడో లైను వీధిలో విద్యుత్ స్తంభాలు నివాసాలలో కలిసిపోయాయి. వాటికి ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలు భవనాల ముందుభాగం గోడలపైన వెళుతున్నారు. స్తంభాలు మురుగుకాలువల మధ్యలోనే ఉంటున్నాయి. దీంతో స్థానికులు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. ఆ వీధికి మరోవైపు ఇటీవల నూతనంగా విద్యుత్ స్తంభాలు నాటారు. ఆ సమయంలో కాలువల్లో, ఇళ్ల ముందు ఉన్న స్తంభాలను తొలగించి ఎదురుగా ఖాళీ స్థలంలో రోడ్డువెంట ఏర్పాటుచేయాలని పదే పదే కోరినా పట్టించుకోలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే తమకు , తమ బిడ్డలకు బాధ్యులు ఎవరు అని ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

భయంతో బతుకుతున్నాం



కరెంటు వైర్లు గోడలకు ఆనుకొని ఉన్నాయి. మిద్దెలపై నిలబడే సమయంలో తగులుతున్నాయి. గాలివానల సమయంలో తీగలు ఇళ్లమీదకు వచ్చేస్తున్నాయి. ఏక్షణం ఏంజరుగుతుందో తెలియడం లేదు. కరెంటోళ్లకు చెప్పినా పట్టించుకోలేదు. ఎప్పుడేం జరుగుతుందోనని బిక్కుబిక్కుమని కాలంగడుపుతున్నాం.

- లక్ష్మి

ఖాళీ స్థలంలోకి మార్చాలి



ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదు. జరగరాని సంఘటనలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. దినదిన గండంగా గడుపుతున్నాం. విద్యుత్ స్తంభాలను ఎదురుగా ఉన్న ఖాళీ రోడ్డు స్థలంలోకి మార్చాలి.

- మోహన్





ఇదీ విషపూరితమే. బ్యాండెడ్ సీ క్రైట్ (సముద్రపు కట్లపాము)

డేంజర్ స్నేక్ కింగ్ కోబ్రా

కట్లపాము కరిస్తే అంతే!

శేషాచలకొండల్లో గుర్తించిన గాలిలో ఎగిరే శ్రీలంకన్ ఫ్లయింగ్ స్నేక్

శేషాచల కొండల్లో అరుదుగా కనిపిస్తూ అంతరించిపోతున్న సన్నని పగడపు పాము

శేషాచలంలో 35 రకాల పాములు

దేశంలో ఉన్న పాముల జాతులు: 300, విషపూరితమైనవి: 60

అత్యంత విషపూరితం: ఇండియన్ కోబ్రా, నాగుపాము, రక్తపింజరి, కట్లపాము, గుడ్లపింజరి

పా..పా..పాము!
ప్రమాదకరం కాదు

శేషులచలం : తిరుమల శేషాచలం కొండల్లో 35 రకాల పాములు ఉన్నాయి. వీటిల్లో కొన్ని అరుదైన జాతులు. అవి.. ఇండియన్ సాండ్ స్నేక్ (ఎర్ర ఇసుకబోతు), నాగార్జునసాగర్ రేసర్ (బోలావతి), శ్రీలంకన్ ఫ్లయింగ్ స్నేక్(గాలిలో ఎగిరే పసిరిక పాము), సన్నని పడగపు పాము(ఇది అంతరించి పోతోంది). అయితే శేషాచలంలోని సర్పజాతులపై ప్రత్యేకమైన పరిశోధనలు ఏవీ ఇంత దాకా జరగనే లేదు. అందువల్లే ఉన్న 35 రకాల పాములకు సంబంధించిన పూర్తి సమాచారం కూడా అందుబాటులో లేదు.

పాము కనిపించగానే ముందుగా ఒళ్లంతా పాములా జరజరా భయం పాకుతుంది. అది మీదకి వచ్చి కాటేసేస్తుందేమో అనే ఆందోళన కలుగుతుంది. విషపు కీటకం.. కొట్టి చంపేస్తేనే మేలు అనే అభిప్రాయానికి వస్తారు. కర్రతోనో, రాళ్లతోనో ఇక పాము మీద దాడి చేస్తారు. అది పారిపోయే ప్రయత్నం చేస్తుంది. దెబ్బ తగిలి తప్పించుకుంటే పాము పగబడుతుందనే నమ్మకంతో ఎట్లాగైనా చంపేయాలనే పట్టుదలతో పాము ప్రాణాలు తీసేస్తారు. ఆ తర్వాత మళ్లీ దానికి దహనక్రియలు చేస్తారు. పాలు పోస్తారు. దణ్ణం పెట్టుకుంటారు. దేవతగా ఒకవైపు పూజిస్తూనే కనిపిస్తే మాత్రం పామును కొట్టి చంపేసే విచిత్ర నైజం మనిషిది. మనిషిలోని భయమే పాము ప్రాణాలు తీస్తోంది. నిజానికి కనిపించేవన్నీ విషం కాదు. ఏది విషం, ఏది కాదు అని తెలిస్తే చాలు.. చాలా పాములు పాపం బతికిపోతాయి. ఈ రోజు స్నేక్ డే సందర్భంగా మన ప్రాంతంలో ఉండే పాములూ.. వాటి విశేషాలపై ప్రత్యేక కథనం..



కొండ చిలువ సైజు పెద్దదేగానీ విషం ఉండదు

WORLD SNAKE DAY

మాయా సర్పం: పూడుపాము

తరచూ మన ప్రాంతంలో వార్తల్లో ఉండేది పూడుపాము. దీనిని స్మగ్లింగ్ చేస్తూ పట్టుకున్నారు అని చదువుతూ ఉంటాం. విదేశాలకు దీనిని తరలిస్తుంటారని చెబుతారు. ఒక పాము విలువ కోటి దాకా పలుకుతుందని కూడా ప్రచారం. అయితే అసలు ఈ పాము ఎందుకు స్మగుల్ అవుతోంది? దీని వల్ల ఉపయోగాలు ఏమిటి అనే విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. దీనికి అతీంద్రియ శక్తులుంటాయనీ, ఇంట్లో పెట్టుకుంటే అదృష్టం అనీ, ఔషధ విలువలుంటాయనీ.. ఇలా రకరకాల ప్రచారాలున్నాయి. ఇవి నిజమో కాదో కూడా తెలీదు. అయినా ఇవి స్మగుల్ అవుతూ దొరుకుతూనే ఉన్నాయి. రెండు తలలున్నట్టుగా కనిపించే పూడుపాము ఎటువైపునకైనా కదులుతుంది. మన జిల్లాలో చాలా ప్రాంతాల్లో విస్తృతంగా ఇవి కనిపిస్తాయి. చురుగ్గా ఉండదు. మట్టిలో దాగి ఉంటుంది. ఇది విషపు పాము కాదు. అయినా కరిస్తే ఒళ్లంతా వికారంగా మచ్చలు వస్తాయని అంటారు. అందుకే మన ప్రాంతంలో ఎవరిమీదైనా కోపం ఉంటే 'వాడ్ని పూడుపాము కరవ' అని శాపనార్థం పెడతారు. మనదేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ పూడుపాములు ఉంటాయి. ఇరాన్, పాకిస్తాన్‌లలో కూడా కనిపిస్తాయి.




పాములను చంపొద్దు.. ప్లీజ్!

నిజానికి పాములు రైతులకు మిత్రులనే చెప్పాలి. రైతులు కష్టపడి పండించిన పంటలను ఎలుకలు, మిడతలు ఇతర కీటకాలు తిని ధ్వంసం చేయకుండా వాటిని ఆహారంగా తీసుకుని పాములు రైతులకు మేలు చేస్తుంటాయి. పంట పొలాల్లో, అడవుల్లో, చెరువుల్లో కనిపించే పాములు అన్నీ విషంగల్లవి కావు. విషసర్పాలు కూడా మనిషి మీదకు రావు. వాటికి మనవల్ల ప్రమాదం అనిపిస్తేనే కాటేస్తాయి. కనిపించగానే భయపడి చంపేయకుండా స్నేక్ రెస్క్యూ టీంకి సమాచారం ఇస్తే పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేస్తారు. చంపేసుకుంటూ పోతే భూమ్మీద పాము అనేదే లేకుండా పోతుంది. ఇందువల్ల సమతుల్యత దెబ్బతింటుంది.



- లక్ష్మీ సౌజన్య, రమణ నాయక్, పాములపై పరిశోధకులు



విషపూరిత రక్త పింజర

మన సముద్ర జలాల్లో 16 రకాల పాములు

పాములు భూమ్మీద మాత్రమే కాదు సముద్రంలో కూడా ఉంటాయి. తరచూ మత్స్యకారుల వలల్లో పడుతుంటాయి. వీటిని తిరిగి నీళ్లలో వదిలేస్తుంటారు. తిరుపతి జిల్లాలో 16రకాల సముద్రపు పాములున్నాయని అంచనా. వీటిలో చాలా వరకు విషపూరితమైనవిగానే గుర్తించారు. తడ, వాకాడు, కోట సముద్ర తీర ప్రాంతాల్లో ఇవి మత్స్యకారులకు తారసపడుతుంటాయి. వాలుకుర్తిపాము, కస్తూరినాగపాము, హైడ్రోఫిష్ పాము, గలంగిరి, వాలగిరి, చంబాబు, నల్లదాసు పాములు ఎక్కువగా మన జిల్లాలోని సముద్ర జలాల్లో కనిపిస్తుంటాయి. అలాగే సముద్ర తీరంలోని ఇసుక ప్రాంతాల్లో ఇండియన్ సాండ్ బోవ(ఎరిక్స్ జోని), కాండనారస్, స్టాట్ సాండ్ స్నేక్ వంటి పాములు కనిపిస్తుంటాయి.ఇక తిరుపతి జిల్లాలో ఉన్న పులికాట్ సరస్సులో వానపాములు, సేతుపాములు మాత్రమే ఉంటాయి. ఇవి విషపూరితం కాదు. ఇక్కడి వానపాము (ఎర్ర) సైజు చాలా పెద్దదిగా ఉంటుంది. అందుకే పెద్ద ఎత్తున వీటిని సేకరించి స్మగుల్ చేస్తుంటారు.

వాలంగిరితోనే ప్రమాదం

సముద్రంలో చేపలు పట్టేందుకు ఎన్నో తరాలుగా మేం వెళ్తూనే ఉన్నాం. వలలో చేపలతో పాటు కొన్ని పాములు కూడా పడుతుంటాయి. వాటిలో వాలంగిరి పాము అత్యంత విషపూరితమైంది. ఈ పాము కరిచి మా పూర్వీకులు చాలామంది మరణించారు. దీనికి మందు దొరకడం అరుదు. మిగతావి కరిచినప్పటికీ అంత ప్రమాదం ఉండదు.



- దక్షాది నటరాజన్, మత్స్యకారుడు, గోవిందపల్లి, కోటమండలం

స్నేక్ ఫ్రెండ్ : మనుషుల నుంచి ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా దాదాపు 18వేల పాముల్ని పట్టుకుని భద్రంగా అడవుల్లో వదలిపెట్టిన స్నేక్ ఫ్రెండ్ ఒకరు తిరుపతిలో ఉన్నారు. తిరుమల కొండమీద, తిరుపతిలోనూ పాము కనిపించిందని సమాచారం అందగానే ప్రత్యక్షమైపోతారాయన. అలవోకగా పట్టి బంధించి దూరంగా విడిచిపెట్టే భాస్కర్‌నాయుడు కూడా రెండు సార్లు పాముకాటుకి గురై ప్రాణాలమీదకు తెచ్చుకున్నారు. అయినా ఈ పనిని శ్రీవేంకటేశ్వరస్వామి తనకు అప్పగించిన బాధ్యతగా భావిస్తారు. 1982లో టీటీడీ అటవీశాఖలో కూలీగా చేరిన ఆయన ఆ తర్వాత స్నేక్ క్యాచర్‌గా మారిపోయారు. ఆయన కోసమే ఒక పోస్టును టీటీడీ ఏర్పాటు చేయడం విశేషం. రిటైరై పదేళ్లయినా ఆయనకు కాంట్రాక్టు పద్ధతిలో అదే పనిని టీటీడీ అప్పగించింది. జీవవైవిధ్య పురస్కారాలు ఎన్నో అందుకున్న 69 ఏళ్ల భాస్కర్ నాయుడుకి శేషాచలం అడవుల్లో ఉండే అనేక రకాల పాముల గురించిన అవగాహన ఉంది.

"పాము.. రోడ్డుమీద, పార్కులో లేదా ఇంట్లోకి వచ్చినా భయంతో కేకలు వేస్తూ హడావుడి చేయవద్దు. పాము మీదకి రాళ్లు, చేతికందిన వస్తువులు, మట్టి వంటివి అసలు వేయకూడదు. అలా చేస్తే తనకు ప్రమాదం అని భావించి ఆత్మరక్షణ కోసం పాము తిరగబడుతుంది. కాటేస్తుంది. శబ్దం చేయకుండా దూరం నుంచి దాని కదలికలు గమనించండి. మనుషుల ఉనికి ఉన్నతావులో పాము ఉండదు. పొరపాటున వచ్చినా దూరంగా వెళ్లిపోతుంది. ఒకవేళ అక్కడే ఉండిపోతే టీటీడీ సిబ్బందికి సమాచారం ఇస్తే చాలు.. నేను వచ్చి దానిని పట్టుకుని దూరంగా తీసుకువెళ్లి విడిచిపెడతాను."



- భాస్కర్ నాయుడు, టీటీడీ స్నేక్‌క్యాచర్

ప్రత్యేక కథనం
మంగళం, ఆంధ్రజ్యోతి

సత్యవేడుపై ఎంతమంది పెత్తనం?

- సమన్వయం మాట వదిలి సమస్యలు వస్తున్నాయన్న ఎమ్మెల్యే ఆదిమూలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): 'ఒకరేమో పరిశీలకులు అంటారు. మరొకరు కో-ఆర్డినేటర్ అంటారు. ఇంకొకరు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అంటారు. సత్యవేడుపై ఇలా ఎంత మంది పెత్తనం చేస్తారు' అని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రశ్నించారు. పిచ్చాటూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సైకిల్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేగా తానుండగా మరొకరికి ఇన్‌చార్జి పదవి ఎందుకు? ప్రతి పక్ష ఎమ్మెల్యేలున్న చోట మాత్రమే అది సాధ్యమవుతుంది. ఇప్పటికైనా అపోహలు వీడి కుల, గ్రూపు రాజకీయాలకు స్వస్తి చెప్పి నియోజకవర్గ అభివృద్ధి కోసం సమష్టిగా ముందుకెళదాం' అని పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గంలో కుల గ్రూపు రాజకీయాలను సమన్వయం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయడం కోసం టీడీపీ అధిష్ఠానం శంకర్‌రెడ్డిని పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా నియమించిందే తప్ప ఇన్‌చార్జిగా కాదని మరోసారి ఆయన స్పష్టంచేశారు. శంకర్‌రెడ్డి తనకు మిత్రుడు, సన్నిహితుడైనా కొందరు నేతల మాటలు నమ్మి తన ఓటమికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే హేమలత, మరికొందరు గ్రూపు రాజకీయ నేతలతో కలసి సభలు, సమావేశాలు, ప్రచార ఆర్భాటాలు చేయడం వల్ల ప్రభుత్వం ఆశించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం మరుగున పడిపోతోందన్నారు. దీంతో పార్టీలో సమన్వయం మాట పక్కన పెట్టి పలు సమస్యలు వస్తున్నాయన్నారు. రిజర్వుడు నియోజకవర్గంలో ఇలాంటి పెత్తనాలు చేస్తే అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచినట్లు అవుతుందన్నారు. అలాంటి పనులకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహకరించరని ఆయన స్పష్టంచేశారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై ఉన్నానని, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తూ సీఎం చంద్రబాబుకు విధేయుడిగా ఉంటానని చెప్పారు. ఈ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, నీటి సంఘాల అధ్యక్షులు రవిరెడ్డి, పద్దురాజు, నాయకులు వాసురెడ్డి, ఢిల్లీ రాజేశ్వరి, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ రాక

- రేపు ఐఐటీలో ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రి చిరాగ్ పాశ్వాన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి తిరుచానూరు వద్దనున్న తాజ్‌హోటల్‌కు చేరుకుని బస చేస్తారు. గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరిగి తాజ్ హోటల్‌కు చేరుకుంటారు. ఉదయం 11గంటలకు ఏర్పేడు వద్దనున్న ఐఐటీకి చేరుకుని ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు.

- వెయ్యి మంది కాదు 5 వేల మంది ఉన్నారు

తొలగించే దమ్ముందా?

- తిరుమలలో అన్యమతస్థుల అంశంపై చింతా మోహన్ సవాల్

తిరుపతి(వైద్యం), జూలై 15(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో వెయ్యి మంది కాదు.. ఐదువేల మంది అన్యమతస్థులు ఉన్నారు. భక్తుల సేవలో పారిశుధ్య పనులు చేస్తున్నారు. వారిని తొలగించే దమ్ము మీకుందా? తిరుపతి, తిరుమల గురించి మాట్లాడేందుకు బండి సంజయ్ ఎవరు?' అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఘాటుగా స్పందించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ముందు మంగళవారం ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. దేశంలో అభివృద్ధిని బీజేపీ నేతలు పక్కన పెట్టి, ఎప్పుడూ అన్యమతం.. అన్యమతస్థులు అంటూ పవిత్రమైన తిరుమలపై రచ్చ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. నిరుద్యోగులు, పూట గడవని నిరుపేదల గురించి పట్టించుకోకుండా ఎప్పుడూ అన్యమతంపై మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. తిరుమలలో అన్యమతస్థులు ఎవరు.. ఏం పని చేస్తారో మీకు తెలుసా అంటూ ప్రశ్నించారు. మీరు చెప్పే అన్యమతస్థులే నిత్యం భక్తుల మల, మూత్రాలను శుభ్రం చేస్తూ, అతి తక్కువ జీతాలకు పనిచేస్తూ పొట్ట నింపుకుంటున్నారన్నారు. వారిని తొలగిస్తే తెలంగాణ నుంచి కార్మికులను తీసుకొచ్చి పని చేయిస్తారా అంటూ వ్యాఖ్యానించారు. తిరుమలలో కాంగ్రెస్ హయాంలో తప్ప తర్వాత ఈవో, డిప్యూటీ ఈవో స్థాయిలో ఎస్సీలను నియమించకపోవడాన్ని చూస్తే తిరుమలలో అంటరానితనం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం ఉన్నతస్థాయిలో ఒక్క ఎస్సీ అధికారైనా తిరుమలలో ఉన్నారా అని ప్రభుత్వాన్ని అడిగారు. బ్యాంకుల రుణాల మాఫీ, ఎన్డీఏ పాలనలో జరిగిన రూ. లక్ష కోట్ల అవినీతిపై బండి సంజయ్ మాట్లాడితే బాగుంటుందన్నారు. టీటీడీలో పనిచేసే అర్చకులకు, శాశ్వత ఉద్యోగులకు 5 సెంట్ల నివాస స్థలాన్ని ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు యార్లపల్లి గోపీగౌడ్, రవి, తేజోవతి, మునిశోభ తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ పరిపాలన భవనం ముందు నిరసన తెలుపుతున్న చింతా మోహన్

ఎస్వీయూలో చిరుతల కలకలం

మంగళం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో చిరుతలు విద్యార్థులు, ప్రజలను భయపెడుతున్నాయి. క్వార్టర్స్‌లోని పెంపుడు శునకాలను, వర్శిటీ సమీప ప్రాంతాల్లో ఉండే శునకాలను చిరుతలు వదలడంలేదు. చీకటి పడితే చాలు శేషాచల అటవీప్రాంతం నుంచి రీజనల్ సైన్స్‌సెంటర్ సమీప అటవీప్రాంతాల మీదుగా ఎస్వీ యూనివర్శిటీ, వేదిక్, వెటర్నరీయూనివర్శిటీ ప్రాంతాలకు చేరుకుంటున్నాయి. ఇక్కడ సమీప ప్రాంతాల్లోని హాస్టల్ వద్ద వేసిన ఆహారం కోసం శునకాలు వస్తుంటాయి. అయితే అప్పటికే మాటు వేసిన చిరుతలు వీటిని చంపితిని తిరిగి అడవుల్లోకి వెళ్లిపోతుంటాయి. అలా వాటికి ఆహారం దొరకనిపక్షంలో వర్శిటీలోని క్వాటర్స్, హాస్టళ్ల వద్దకు వస్తున్నాయి. గత వారం రోజులుగా రెండు చిరుతుల సంచరిస్తుండటాన్ని విద్యార్థులతో పాటు హాస్టల్‌సిబ్బంది , స్థానిక ప్రజలు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీశాఖ అధికారులు మూడు ప్రాంతాల్లో బోన్లను కూడా ఏర్పాటు చేశారు. అలాగే చిరుతలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో 10 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు రాత్రి పూట ఆరుగురు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అయితే చిరుతల వల్ల ప్రమాదం ఎటువైపు నుంచి ముంచుకువస్తుందో అన్న భయంతోవిద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



ఎస్వీ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన కెమెరాకు చిక్కిన చిరుత



ఎస్వీ యూనివర్శిటీలో చిరుతల కోసం అటవీశాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన బోను

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.72 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,149
తలనీలాలు సమర్పించినవారు: 29,066

---

192 ఎర్రచందనం దుంగల స్వాధీనం

నలుగురు స్మగ్లర్ల అరెస్టు

- కారు, మోటారు సైకిల్ స్వాధీనం

మంగళం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా చేజర్ల అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి 192 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ మోటారు సైకిల్, ఒక కారును సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం, స్థానిక ఎఫ్‌బీవో జనార్దన్‌తో కలిసి మంగళవారం నెల్లూరుజిల్లా చేజర్ల అటవీప్రాంతంలోని కలువాయి ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ నిర్వహిస్తుండగా ఒక కారు, ఒక మోటారు సైకిల్‌తో కొందరు గుమికూడిపోలీసులక కంటపడ్డారు. వారిని చుట్టుముట్టి పట్టుకునే ప్రయత్నం చేయగా వారు పారిపోయారు. అయితే టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వీరిలో ఇద్దరు తమిళనాడుకు చెందివారు, మరో ఇద్దరు నెల్లూరు జిల్లాకు చెందివారుగా గుర్తించారు. కారులో లోడ్ చేసిన ఎర్రచందనం దుంగలతో పాటు సమీపంలో దుంగలను రీఫర్లు, పలకలుగా మార్చి దాచి ఉంచిన వాటితో సహా 192 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.50లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టుబడ్డ స్మగ్లర్లను వాహనాలతో సహా ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

పుత్తూరు వార్తలు

నిద్రమత్తులో డ్రైవింగ్

- హోటల్‌పైకి దూసుకెళ్లిన కొరియర్ లారీ
- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు


ప్రమాదంలో మృతి చెందిన అవనాక్షయ్య - దూసుకెళ్లిన వాహనం

పుత్తూరు అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): నిద్రమత్తులో వాహనం నడిపి టీ తాగుతున్న వ్యక్తిని ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం పరమేశ్వరమంగళం వద్ద మంగళవారం ఉదయం జరిగింది. ఎస్‌ఐ ఓబయ్య తెలిపిన వివరాలు.. డీటీడీసీ కొరియర్‌కు చెందిన వాహనంతో డ్రైవర్ విజయన్ తిరుపతి నుంచి చెన్నైకు బయలుదేరాడు. మంగళవారం వేకువజామున 5.30 గంటల సమయంలో పరమేశ్వరమంగళం వద్ద నిద్రమత్తులో రోడ్డుపక్కన హోటల్‌పైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో ఓ ప్రైవేటు స్కూల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ అక్షయ హోటల్ వద్ద టీ తాగి ఇంటికి వెళ్తున్న అవనాక్షయ్య(55)ను ఆ తరువాత అక్కడే పార్కింగ్ చేసిన ఉన్న కారును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అవనాక్షయ్య అక్కడికక్కడే మృతి చెందగా తమిళనాడు కొళత్తూరుకు చెందిన కారు డ్రైవర్ రాజాకు తీవ్రగా యాలయ్యాయి. కారులో ఉన్న ప్రయాణికులు హోటల్‌లో టీ తాగడానికి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

'స్మగ్లింగ్'పై ఉక్కుపాదం మోపండి

- ఎమ్మెల్యే భానుప్రకాష్


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో గంజాయి, బియ్యం, గ్రావెల్, ఇసుక స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని అధికారులను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశించారు. ఇటీవల స్టోన్‌డస్ట్ ముసుగులో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లను సీజ్ చేసిన అధికారులను అభినందించారు. మంగళవారం నియోజకవర్గంలోని రెవెన్యూ, పోలీసు అధికారులతో ఆర్డీవో కార్యాలయంలో ఆయన సమీక్షించారు. నగరికి 45 కిలోమీటర్ల దూరంలో విమానాశ్రయం వచ్చే అవకాశం ఉందని, విజయపురం మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సామాన్యుడికి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. నిరుపేదలను గుర్తించాలని.. వీలైనంత మందికి ఇంటి పట్టాలిచ్చి, పక్కాగృహాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. డీఎస్పీ అజీజ్, సీఐలు విక్రమ్, భాస్కర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మెరుపు దాడులు

రెండు దుకాణాలపై చర్యలకు సిఫార్సు

పుత్తూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మందుల షాపులపై మంగళవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రూత్ మెరుపు దాడులు నిర్వహించారు. రెండు షాపులపై చర్యలకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ కాలం చెల్లిన మందుల విక్రయం, నిద్రమాత్రలు బిల్లులు లేకుండా కొనడం, వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నారంటూ రెండు షాపులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామని చెప్పారు. ఇకపై తరచూ దాడులు నిర్వహించి నిబంధనలు పాటించని షాపులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తడుకు సింగిల్ విండో చైర్మన్‌గా కరుణాయాదవ్



పుత్తూరు టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మండలం తడుకు సింగిల్ విండో చైర్మన్‌గా కరుణాయాదవ్, సభ్యులుగా ఏ.భాస్కర్, విజయభాస్కర్‌రెడ్డి నియమించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా కరుణాయాదవ్ మాట్లాడుతూ తమకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తడుకు సొసైటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ రైతులకు అండగా నిలుస్తామని తెలిపారు.

వడమాలపేట, కాయం సింగిల్ విండోలకు చైర్మన్ల నియామకం


అమాస రాజశేఖరరెడ్డి - భూచేంద్ర ప్రసాద్

వడమాలపేట,జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడమాలపేట, కాయం సింగిల్ విండోలకు చైర్మన్, సభ్యులను ప్రభుత్వం నియమించింది. డీసీపీబీ చైర్మన్‌గా అమాస రాజశేఖరరెడ్డిని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో భాగంగా కాయం సింగిల్‌విండో చైర్మన్‌గా ఆయన ఎంపికయ్యారు. సీతారామాపురానికి చెందిన దేవరాజుల నాయుడు, కాయం కు చెందిన మంజుల సభ్యులుగా ఉంటారు. అలాగే వడమాలపేట సింగిల్ విండో చైర్మన్‌గా వడమాలకు చెందిన డి.భూచేంద్ర ప్రసాద్(కుమార్), సభ్యులుగా టీసీ అగ్రహారానికి చెందిన వెంకటరమణ, బట్టీకండ్రిగకు చెందిన పొన్నయ్‌రాజు ఎంపికయ్యారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



వడమాలపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి):స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి పురుషోత్తం రెడ్డి బహుమతులు అందజేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం సూచనల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వడమాలపేటలె జనాభా పెరుగుదల వల్ల కలిగే లాభనష్టాలపై, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు పెద్దబాల శిక్ష, ఇతర గ్రంథాలను అందించారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

కోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఏవో సుచేంద్ర ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కోట, చెందోడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఎరువులు, పురుగు మందుల వినియోగం, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

తండ్రి, కొడుకుపై కేసు

వాకాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిరాయదొరువు పంచాయతీ మనపాళెం గ్రామానికి చెందిన తండ్రి, కొడుకులు ఆశిరెడ్డి, ప్రతాప్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. మనపాళెం గ్రామంలో సర్వే నెంబరు 30లో 15 ఎకరాలు గ్రామ కంఠం ఉంది. అందులో గ్రామస్తులు జీవన ప్రగతికి పది షాపులు పెట్టుకునేలా తీర్మానం చేశారు. 8 మంది తాత్కాలిక నిర్మాణాలు చేపడితే ఆశిరెడ్డి, ప్రతాప్ పక్కా ఇంటి నిర్మాణాలను చేపట్టడంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మనపాళెం గ్రామస్తులపై ఆశిరెడ్డి, ప్రతాప్ దాడులు చేసేందుకు ప్రయత్నించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

తూర్పు కనుపూరులోనే పాఠశాలను కొనసాగించాలి

చిల్లకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను కొమరవారిపాళెం పాఠశాలలో విలీనం చేశారని, ఈ ప్రక్రియను నిలుపుదల చేసి తూర్పు కనుపూరులోనే పాఠశాలను కొనసాగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు మంగళవారం పేర్కొన్నారు. తూర్పు కనుపూరులోని 1నుంచి 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలను గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమరవారిపాళెం పాఠశాలలో విలీనం చేశారన్నారు. దీంతో గిరిజన విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం మానుకున్నారన్నారు. పాఠశాల విలీనంతో చిన్నారులు చదువులకు దూరమవుతున్నారన్నారు. అధికారులు విలీన ప్రక్రియను విరమించుకుని తూర్పు కనుపూరులోనే పాఠశాలను కొనసాగించి విద్యార్థులకు విద్య దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.


డంపింగ్ యార్డులో వ్యర్థాలను తోడుతున్న యంత్రాలు ● వ్యర్థాల రీసైక్లింగ్

మున్సిపాలిటీ నుదిటిన చెత్తకు ఇక చెల్లు

వ్యర్థాలతో బయోమైనింగ్ ద్వారా ఎరువుల తయారీ ● ఉద్యానవనం కానున్న డంపింగ్ యార్డు

సూళ్లూరుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ముఖ్య పట్టణం సూళ్లూరుపేట. ఇక్కడి నివాస గృహాలతో పాటు దుకాణాలు, వ్యాపార సముదాయాల నుంచి ప్రతిరోజూ టన్నుల కొద్దీ చెత్త పోగవుతోంది. పట్టణ నడిబొడ్డులో జాతీయ రహదారి పక్కనే హోలిక్రాస్ సమీపంలో కాళంగి నదిని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డులో చెత్తను నిల్వ చేస్తున్నారు. ఈ ప్రక్రియ గత 30 ఏళ్లుగా సాగుతోంది. డంపింగ్ యార్డులో వ్యర్థాల నిల్వలు చిన్నపాటి కొండలను తలపిస్తున్నాయి. దుర్వాసనతో పట్టణవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈదురు గాలులకు చెత్తా, చెదారం గాల్లోకి ప్రవేశిస్తుండడంతో జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అప్పుడప్పుడు డంపింగ్ యార్డులో మంటలు చెలరేగాయంటే రెండు వారాల పాటు రగులుతూనే ఉండేది. చెత్త నుంచి వచ్చే పొగతో పక్కనే నివాస ప్రాంతాలు ఉండలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా సూళ్లూరుపేటను చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తచెదరాలను తొలగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. బయోమైనింగ్ పద్ధతి ద్వారా వ్యర్థాల ప్రాసెసింగ్ పనులను జిగ్మా సంస్థకు అప్పగించింది. జూన్ మొదటి వారం నుంచి డంపింగ్ యార్డులో పనులు మొదలయ్యాయి. 38261 మెట్రిక్ టన్నుల చెత్తను విభజించేందుకు యంత్రాలతో తిరగతోడుతున్నారు. అనంతరం పెద్దపెద్ద పరికరాలతో జల్లెడ పట్టి వ్యర్థాలను వేరు చేస్తున్నారు. ఆ వ్యర్థాల నుంచి మట్టి, రాళ్లు, ప్లాస్టిక్‌ను వేరుచేసే చకాచకా సాగుతోంది. యంత్రంతో వేరుచేసిన మట్టిని కంపోస్టు ఎరువుగా మారుస్తారు. అలాగే డంపింగ్ యార్డులో ఉన్న చెత్త వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను వేరుచేసి పునర్వియోగించేలా చేస్తారు. డంపింగ్ యార్డులో వ్యర్థాల నిల్వలను ఆగస్టు చివరి నాటికి పూర్తిస్థాయిలో వ్యర్థాలను శుభ్రం చేసి ఆ ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన ఉద్యాన వనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఆదేశించింది.

రూ.713 కోట్లతో ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణం


ఆల్తూరుపాడు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, జూలై 17(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు నిర్మాణం కోసం రూ.713 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయని, త్వరలో టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన ఆల్తూరుపాడు గ్రామంలో రూ.55 లక్షలతో నిర్మించిన తారురోడ్డును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కురుగొండ్ల మాట్లాడుతూ 2018లో ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను సీఎం చంద్రబాబు నాయుడు మంజూరు చేసినట్లు చెప్పారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ రిజర్వాయర్ పనులు జరగనివ్వకుండా అడ్డుకొంటూ వచ్చిందని ఆరోపించారు. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ పనులను మొదలు పెట్టేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే డక్కిలి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో 86వేల ఎకరాలకు సాగునీరు. తిరుపతి, తిరు మలకు తాగునీరు అందివ్వచ్చన్నారు. వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టు నిర్మా ణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్లు చెప్పారు. అలాగే నియో జకవర్గంలో గుంతలు లేని రోడ్లు చూడాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా ఆరా తీశారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, టీడీపీ నేతలు ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి చెంద్రారెడ్డి, శివప్రసాద్, మునిస్వామి రెడ్డి, పులి జనార్దనరెడ్డి, రంగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


నూతన కమిటీతో బీజేపీ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అత్తిరాల కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న బీజేపీ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్రం అమలుచేసే పథకాలు అందేలా పార్టీ నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం సూళ్లూరుపేట పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా ఇంగిలా సాగర్, కె.నిర్మల కుమారి, తుర్లపాటి శ్రీనివాసులు, సృజన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పాకం శివ, ట్రెజరర్‌గా దుర్గి రమేష్, కార్యదర్శులుగా మునిశేఖర్, అన్నవరం మునిరత్నం, హైమావతి కార్యవర్గ సభ్యులుగా వినోద్ కుమార్ రెడ్డి, వెంకటేశ్, సుబ్బారావు, అభిషేక్ జైన్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆరణి విజయ భాస్కర్‌రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు సారె సమర్పణ



సారెతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

కోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు మంగళవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సారె సమర్పణ జరిగింది. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కోటమ్మకు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ చీర, సారెను సమర్పించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కవితమ్మ దంపతుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


రావిగుంటపాళెంలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నేతలు

వాకాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తోందని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని రావిగుంటపాళెంలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, ఇంగిలాల బుజగేంద్ర ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు.

పుట్టుకతో వచ్చే కొన్ని లోపాలను ప్లాస్టిక్ సర్జరీతో సరి చేయవచ్చు

తిరుపతి(వైద్యం), జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ సర్జరీ అనేది కేవలం అందాన్ని మెరుగుపరచడమే కాకుండా ప్రమాదాలు, గాయాలు లేదా పుట్టుకతో వచ్చే కొన్ని లోపాలను సరిచేయడంలో దోహదపడుతుందని రుయా ప్రొఫెసర్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్రరెడ్డి అన్నారు. ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్లతో పాటు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్లాస్టిక్ సర్జరీలో అధునాతన పద్ధతులు వాటి ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం ప్లాస్టిక్ సర్జన్స్‌ను స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్లు ప్రవీణ్, ఝాన్సీ, విజయ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను గుర్తించండి

బాలయపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ-4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాలకు అర్హులైనవారిని త్వరితగతిన గుర్తించాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17నుంచి 25వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి బంగారు కుటుంబాల జాబితా సిద్ధం చేయాలన్నారు.

బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక


ప్రశాంతిరాజును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నాయుడుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంతిరాజు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా పాపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కావేరిపాకం కోటేశ్వరరావు, కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమరావతి రామయ్య, చిగురాకుల సురేంద్రబాబు, పుట్టుపీరయ్య, గాధంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీ-4 పునఃపరిశీలన గ్రామసభలు

ఓజిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరిమేనిపాడు, అత్తివరం, భట్లకనుపూరు గ్రామాల్లో మంగళవారం పీ-4 సర్వే పునఃపరిశీలన గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో పీ-4 సర్వేలో ఎంపికైన బంగారు కుటుంబాల వివరాలను పరిశీలించడంతో పాటు ఇంకా అర్హత ఉన్న కుటుంబాలను జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకున్నారు.

నాయుడుపేట టౌన్: మండలంలోని కాపులూరులో పీ-4 సర్వే గ్రామసభను ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పంచాయతీ విస్తరణాధికారి గోపాల్, పంచాయతీ కార్యదర్శి గోవిందయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తడ: మండలంలోని తడ, తడకండ్రిగ సచివాలయాల వద్ద పీ-4 సర్వే గామసభలు జరిగాయి. ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో శేఖర్‌నాయక్ మాట్లాడుతూ గతంలో గుర్తించిన పేద కుటుంబాలలో 20శాతాన్ని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఆర్ముగం, జయప్రద, పంచాయతీ కార్యదర్శులు మస్తాన్, గాబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలి

వెంకటగిరి టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డిపల్లి వద్ద మామిడి కాయల ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులో పడిపోవడంతో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.20లక్షలు అందించాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మంగళవారం డిమాండ్ చేశారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి


రోడ్డు మలుపులో గుంతలు

గూడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని మలుపు వద్ద రోడ్డు దెబ్బతిన్నడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక వివేకానంద రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ మీదుగా ముత్యాలపేటకు వెళ్లే రోడ్డు మలుపు వద్ద గుంతలు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గూడూరు సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి



గూడూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గూడూరు సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్‌గా అల్లూరు కరుణాకర్‌రెడ్డి, సభ్యులుగా దువ్వూరు రవీంద్రరెడ్డి, బచ్చల రవీంద్రరెడ్డిలను నియమిస్తూ సహకారశాఖ కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గూడూరు సొసైటీకి పాలక వర్గం లేదు. తాజాగా సింగిల్ విండోలకు (పీఏసీఎస్) నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమించింది.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జి కమిటీల నియామకం

చిట్టమూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సింగిల్ విండోలకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీల స్థానంలో నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చిట్టమూరు సొసైటీ చైర్మన్‌గా గుండుబోయిన కస్తూరయ్య, సభ్యులుగా కంటెపల్లి వెంకటరమణయ్య, నరమల మోహన్, మల్లాం సొసైటీ చైర్మన్‌గా రామిసెట్టి హర్‌నాథ్, సభ్యులుగా గొల్ల మణి, చేను వెంకటయ్యను నియమించారు.

నేటినుంచి పారిశుధ్య కార్మికుల సమ్మె


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం నుంచి సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆయన కార్మికులతో సమావేశమై ఈ విషయాన్ని వెల్లడించారు. కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించడంతో పాటు రూ.7లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపజేయాలన్నారు. పలుసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోలేదని, దీంతో సమ్మెబాట పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకుడు చెంగయ్య, సీఐటీయూ నాయకులు సాంబశివయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

విద్యానగర్‌లో జ్యోతి డే


బాలకృష్ణారెడ్డి విగ్రహం వద్ద అధ్యాపకులు, విభాగాధిపతులు

కోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం జ్యోతిడే వేడుకలు జరిగాయి. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విగ్రహానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధి పతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ప్రాంతంలో విద్యా సంస్థలకు బాలకృష్ణారెడ్డి బీజం వేసిన రోజును జ్యోతిడేగా జరుపుకోవడం ఆనవాయితీ.

బీసీ మహాసభలను విజయంతం చేయండి

గూడూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన విజయ వాడలో జరగనున్న జాతీయ బీసీ మహాసభను విజయ వంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మయూరి శ్యామ్‌యాదవ్ పేర్కొన్నారు.

వేడుకగా అమ్మవారికి ఉయ్యాల సేవ

తిరుచానూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సహస్ర దీపాల వెలుగులో పద్మావతి దేవికి అత్యంత వేడుకగా ఊంజల్ సేవ మంగళవారం నిర్వహించారు. అర్చకులు సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని మండపానికి వేంచేపు చేసి ఊంజల్ సేవ నిర్వహించారు.

సీఎంను కలిసిన శంకర్‌రెడ్డి



సత్యవేడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబును సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత శంకర్‌రెడ్డి తొలిసారిగా మంగళవారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో చంద్రబాబును కలిసి నియోజకవర్గ సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధ్వానంగా మారిన రోడ్లను నిర్మించేందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించారని శంకర్ రెడ్డి చెప్పారు.

చేనేతకు ప్రభుత్వం చేయూత

శ్రీకాళహస్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సముపార్జనకు సాధనంగా నిలిచిన చేనేత రంగానికి సీఎం చంద్రబాబు ప్రభుత్వం చేయూతనిస్తోందని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు అన్నారు. పట్టణంలోని పద్మశాలిపేటలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 7వ తేదీ నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలవుతుందన్నారు. ఈ పథకంలో చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు 500 యూనిట్లు విద్యుత్ ఉచితం అని తెలిపారు. చేనేత సహకార రంగాల్లో సభ్యులుగా ఉన్న లక్షలాది చేనేత కార్మికులకు బహుళ ప్రయోజనకరంగా ఉండే త్రిఫ్ట్ పథకానికి నిధులను జాతీయ చేనేత దినోత్సవం నాడు విడుదల చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మిన్నల రవి, నాయకులు బాలాజీరెడ్డి, మునిరాజాయాదవ్, రామచంద్రయ్య, సయ్యద్ చాంద్‌బాషా, జాఫర్, ఈశ్వరయ్య, చలమయ్య, కుమారస్వామి, రాఘవులు, రాజయ్య, రమణయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోండి



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్త శ్రీనివాసులు(రాయుడు) హత్యకు సంబంధించి ఎమ్మెల్యే సుధీర్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి మండల టీడీపీ అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్ డీఎస్పీ నరసింహమూర్తికి ఫిర్యాదు చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న బొజ్జల కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. బత్తిరెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, జగదీశ్వర్‌రెడ్డి, రమేష్‌నాయుడు, దొరైరాజ్‌రెడ్డి, చరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. కంఠా రమేష్, కాసరం రమేష్, గోపి, వజ్రం కిషోర్, పోలూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. వైసీపీ శవ రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు.

బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం: ఆదిమూలం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఆదిమూలం

పిచ్చాటూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో మహేంద్రన్‌కు రూ.5,88,931 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహేంద్ర భార్య మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్స విఫలమై మరణించారన్నారు. భార్యను బతికించుకోవాలన్న తపనతో మహేంద్రన్ రూ.లక్షలు అప్పు చేశాడన్నారు. ఈక్రమంలో వైద్య ఖర్చుల వివరాలను ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయగా రూ.5.89 లక్షలు మంజూరు చేశారన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, వాసురెడ్డి, రవిరెడ్డి, వెంకటరత్నం, సుమాంజలి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుమహిళకు పరామర్శ

శ్రీకాళహస్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకురాలు రేణుకమ్మ గత కొద్దిరోజులుగా చికిత్స పొందుతున్నారు. ఈనేపథ్యంలో మగళవారం ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ రేణుకమ్మ స్వగృహానికి చేరుకుని ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

చెంగల్వరాయుడి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ





అంకురార్పణ పూజలు - పుట్టమట్టి

శ్రీకాళహస్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి సన్నిధి వద్ద మంగళవారం ఆడికృత్తిక ఉత్సవాలకు అంకురార్పణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముక్కంటి లయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై కొలువై ఉన్న వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని వేదమంత్రోచ్చరణల నడుమ పూజలు నిర్వహించారు. ఇక బుధవారం ధ్వజారోహణం జరగనుంది. ఈవో బాపిరెడ్డి, వేదపండితులు, ఆలయఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఏర్పాట్లు

కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఏర్పాట్లను మంగళవారం ఈవో బాపిరెడ్డి పరిశీలించారు. ఈనెల 19న భరణి, 20న ఆడికృత్తిక సందర్భంగా స్వామివారిని సుమారు 50వేలమంది భక్తులు దర్శించుకోనున్న నేపథ్యంలో విజ్ఞానగిరిపై అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యం, వీఐపీలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. నారదపుష్కరణిలో తలనీలాలు సమర్పించే భక్తులు స్నానాలు చేయడానికి స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో, 1వ పట్టణ సీఐ గోపి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





విజ్ఞానగిరి వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో బాపిరెడ్డి, సీఐ గోపి - సిద్ధమవుతున్న తెప్పలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ

శ్రీకాళహస్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా 30వ వార్డు పరిధిలోని సర్దార్‌వీధిలో ఆయన పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిమెంటు రోడ్డు, మురుగునీటి కాలువలు నిర్మించాలని కోరారు. కంఠా రమేష్, దేవిమోహన్, కాసరం రమేష్, ఆర్ముగం, పిశ్రీనివాసులురెడ్డి, రాకేష్, సుధాకర్, హిమత్, వెంకటరమణ, దొరబాబు, సిద్ధులయ్య, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఇక 107, 108 బూత్‌ల పరిధిలో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో గోపి, వెంకటరమణ, ప్రకాష్‌నాయుడు, ఖలీల్‌బాషా, శ్రీనివాసులురెడ్డి, దొరబాబు పాల్గొన్నారు.

ఏర్పేడు(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ కందాటి శివశంకర్‌రెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం నచ్చనేరి పంచాయతీలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాగరాజునాయుడు, గురవారెడ్డి, మోహన్‌రావు, సూరినాయుడు, నాగేశ్వరరావు, హరి, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. మండలంలోని బీసీ కాలనీలో సుపరిపాలన తొలి అడుగు లో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డీ ఏకాంబరం, గోవిందస్వామి, కేఎస్ రవి, ఉమాకందస్వామి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



నచ్చనేరిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం

రెడ్డిప్రకాష్‌కు అభినందన

రేణిగుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా నియమితులైన రెడ్డిప్రకాష్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో బ్రాహ్మణ సంఘం జిల్లా సభ్యులు, లారీ సప్లై అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి వేదం హరి, గణపతి రాయల్, రాజారాయల్, లక్ష్మీనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ స్థాయిలో బీజేపీ బలోపేతం

వరదయ్యపాళెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయిలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజి పిలుపునిచ్చారు. మండలంలోని ఇందిరానగర్‌లో ఓ ప్రైవేటు కల్యాణమండపంలో బీజేపీ మండల అధ్యక్షుడు డిల్లీప్రకాష్ ఆధ్వర్యంలో పార్టీ సమావేశం జరిగింది. మండల కమిటీని, శక్తి కేంద్ర ప్రముఖ్‌ల నియామకాల్ని చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బాలాజి సూచించారు. పి.భాస్కర్‌రెడ్డి, సిద్ధులయ్య, కేబీ గురుదేవ్, వి.పురుషోత్తం, త్యాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ

కేవీబీపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆదేశాల మేరకు కేవీబీపురం మండల కమిటీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్, స్టేట్ స్కౌట్ ప్రెసిడెంట్ మునిశేఖర్, ఓబీసీ రాష్ట్ర నాయకుడు సిద్ధులయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాబుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా అజయ్, ఉపాధ్యక్షులుగా శశి, మంజుల, కోశాధికారిగా హంసమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖాదర్, గోవర్ధన్, వెంకటముని, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గంగ కాలువలో మృతదేహం లభ్యం

సత్యవేడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తెలుగుగంగ కాలువలో మృతదేహాన్ని వెలికితీశారు.ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాలు... మంగళవారం ఉదయం కొత్తమారికుప్పం ఎస్టీ కాలనీ సమీపంలోని తెలుగుగంగ కాలువలో మృతదేహం తేలుతున్నట్టు స్థానికులు సమాచారం అందించారన్నారు. సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. కాగా పోలీసుల విచారణలో మృతదేహం తొట్టంబేడు మండలం చిన్నసింగమాలకు చెందిన మునస్వామి (58)గా గుర్తించారు. ఈనెల 7న బహిర్భూమికి వెళ్లిన మునస్వామి కాళ్లుకడుక్కునేందుకు కాలువలో దిగి నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. మృతుడి భార్య పాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

ఫార్మా కార్మికులకు పరిహారం చెల్లించాలి

రేణిగుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): క్రోమో మెడికేర్ ఫార్మా' కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన కార్మికులకు పరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదంలో గాయపడి చెన్నైలో చికిత్స పొందుతున్న రవీంద్ర, వెంకటేశులుకు మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, సెల్వరాజ్, హరినాథ్ పేర్కొన్నారు.

ఇంటి స్థలాల కోసం ధర్నా

కేవీబీపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లపూడి సమీపంలో ఉన్న కోవనూరు రెవెన్యూ సర్వే నెం.262 బ్లాక్‌లో ఉన్న 54 ఎకరాల ప్రభుత్వ భూముల్లో కర్లపూడిలోని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలుగా ఇవ్వాలని తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఖాళీగా ఉన్న 54ఎకరాలను కొంతమంది ఆక్రమిస్తున్నారని సీపీఎం నాయకుడు జనార్దన్ చెప్పారు. అనంతరం తహసీల్దారు రోశయ్యకు వినతిపత్రం ఇచ్చారు.

సంపద కేంద్రానికి ఫెన్సింగ్ ఏర్పాటు



బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి మంగళవారం ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సంపద కేంద్రం ఊరు వెలుప ఉండటంతో వల్ల పంచాయతీ నుంచి సేకరించిన చెత్తను పశువులు నాశనం చేయడంతో పాటుగా చెత్త ఎక్కడబడితే అక్కడ ఉండడాన్ని ఇటీవల ఎంపీడీవో వెంకటరత్నమ్మ గుర్తించారు. పంచాయతీ నిధులు నుంచి ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు.

పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ సూచించారు. బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె పరిశీలించారు. పాఠశాల ఆవరణలో చెత్త ఉండటంతో స్వీపర్లతో దగ్గరుండి శుభ్రం చేయించారు. ప్రతి రోజూ ఉదయం క్రమం తప్పకుండా స్వీపర్లు ఆవరణాన్ని శుభ్రం చేయించి పంచాయతీ వారు ఏర్పాటు చేసిన డ్రమ్‌లలో చెత్త వేయాలన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు.

మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసుల పరిష్కారం



న్యాయవాదులకు దిశానిర్దేశం చేస్తున్న జడ్జి

శ్రీకాళహస్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. పట్టణంలోని న్యాయస్థాన భవనంలో మంగళవారం మిడియేషన్ ఫర్ నేషన్ అనే నినాదంపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు రాజీ చేయదగిన కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడంపై దేశవ్యాప్తంగా జాతీయ న్యాయసేవల అథారిటీ ద్వారా విస్తృతంగా ప్రచారం సాగుతోందన్నారు. మధ్యవర్తిత్వం కోసం గుర్తించిన కేసులను నిర్దేశిత కేంద్రాలకు పంపి త్వరితగతిన పరిష్కారం చూపవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

సత్యవేడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మా జ్యోతీబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న ఏడుగురు విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. పాఠశాలలో ఇటీవల చేపట్టిన రాష్ట్రీయ బాల ఆరోగ్య కిషోర కార్యక్రమంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఏడుగురు విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన తిరుపతి వైద్యులు ప్రత్యూష, ప్రసాద్, గుణశేఖర్ తమ సొంత నిధులను వెచ్చించి కంటి అద్దాలను అందించారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి క్రిస్టల్ దాస్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ చేతుల మీదుగా విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఎంపీఈహెచ్‌ఈవో సుబ్రమణ్యం, ఎంఈవో2 ఉష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: డ్రైవర్ మృతి

రేణిగుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన గాజులమండ్యం వంతెనపై మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలు... తిరుపతికి చెందిన ఆటో డ్రైవర్ సూరిముని మద్యం తాగి పుత్తూరుకు ఆటోలో వెళ్తుండగా గాజులమండ్యం వంతెనపై వేగాన్ని నియంత్రించలేక బోల్తా పడ్డాడు. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని రూయా ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

వసతి గృహాల్లో మెరుగైన వసతులందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, జూలై 15(ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో ఎప్పటికప్పుడు పిల్లలకు మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ కోరారు. పట్టణంలోని ఎస్టీ బాలుర హాస్టల్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజననాణ్యతను పరిశీలించారు. హాస్టల్ వార్డెన్లు భోజన నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. అలాగే వంట గది, వసతిగృహ పరిసరాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతిగృహంలో నిర్వహణపై ఆరా తీశారు. టీడీపీ నాయకుడు కన్నలి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.